

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

సీఎం చంద్రబాబు నివాసానికి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

4

## మీకు న్యాయం.. నా బాధ్యత



- రాజధాని ఫలాలు తొలిగా అమరావతి రైతులకే దక్కాలి
- రాజధానిని గుర్తిస్తూ కేంద్రాన్ని నోటిఫికేషన్‌ను కోరాం
- క్యాపిటల్ గెయిన్స్ గడువు పొడిగింపుపై చర్చిస్తాం
- అమరావతి రైతులతో సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం
- రెండోవిడత ల్యాండ్ పూలింగ్‌కు సానుకూలమేనన్న రైతులు
- అమరావతి డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- సీఎం దృష్టికి తీసుకొచ్చిన అమరావతి రైతాంగం

5

## ప్రజా ప్రయోజనాలే అభివృద్ధి అజెండా

- పార్లమెంట్‌లో రాష్ట్ర అంశాలు ప్రస్తావించండి
- ప్రాజెక్టులకు అనుమతులు- రైతు సమస్యలకు పరిష్కారం ముఖ్యం
- టీడీపీపీ సమావేశంలో ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

4

రాజధానిలో ఎల్ఐసీ, 15 బ్యాంకుల

### ప్రధాన కార్యాలయాలకు నేడు శంకుస్థాపన

కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా..

5

## రాపిడోతో టూరిజం టైఅప్!

- దేశంలోనే తొలిసారిగా 'డ్రైవర్-కం-గైడ్' సేవలు
- త్వరలోనే విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలో సేవలకు సన్నాహాలు

3

## తిరుమల తరహాలో

# అమరావతి ఆలయాభివృద్ధి



- రెండు దశల్లో రూ.260 కోట్లతో విస్తరణ పనులు
- రెండున్నరేళ్లలో పూర్తికి సన్నాహాలు
- గత ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధికి అడ్డంకులు
- రాజధానికి భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి
- అమరావతి వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ శంకుస్థాపన
- పాల్గొన్న టీటీడీ ఛైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, రైతులు

2

## నలుచెరగులా శ్రీవారి ఆధ్యాత్మిక వైభవం

- ఆధ్యాత్మికం, అన్నదానం, విద్య, వైద్యానికి చిరునామాగా టీటీడీ
- శ్రీవారి సేవకులుగా వైద్య నిపుణులకు అవకాశం
- వైకుంఠ ఏకాదశి దర్శనాలకు పటిష్టంగా ఏర్పాట్లు
- ప్రధాన దేవాలయాల్లో తిరుమల తరహా విధానాలు
- బోర్డు సభ్యుల కమిటీల పర్యవేక్షణలో కొత్త దేవాలయాల నిర్మాణం
- పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణకు టీటీడీ కార్యాచరణ
- తితిదేపై సమీక్షలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

3

# మతం ఏదైనా మానవత్వం ముఖ్యం



- అవకాశాల సద్వినియోగంతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు
- అందరూ రాష్ట్ర, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- మెరుగైన సమాజం కోసం నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉంది
- మంగళగిరిలో నూర్ మస్జిద్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్

8



## మంగళగిరిలో మోడల్ పబ్లిక్ లైబ్రరీ

- ప్రారంభించిన మంత్రి నారా లోకేష్
- లైబ్రరీ ఆధునీకరణకు రూ.1.72 కోట్ల వ్యయం

## మొక్కజొన్న రైతులకు అండగా ఉంటాం

- మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టీకరణ

10

## రబీలో యూరియా సమస్య తలెత్తకూడదు

- అధికారులతో సమీక్షలో మంత్రి అచ్చెన్న

13

## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

- ఇప్పటికి 8,22,000 మెట్రిక్ టన్నుల కొనుగోలు
- రైతుల ఖాతాల్లో రూ.1,713 కోట్లు జమ
- కొనుగోలు చేసిన 4-6 గంటల్లోనే నగదు చెల్లింపులు
- అసత్య ప్రచారాలను రైతులు నమ్మొద్దు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

11

## తిరుపతిలో 600 ఎకరాల్లో ధార్మిక టౌన్‌షిప్

- అనుమతులు, ప్రాజెక్టు పూర్తికి సహకరించండి
- మంత్రి అనగానిని కలిసిన 'డెల్లా' గ్రూపు ప్రతినిధులు

12

# తిరుమల తరహాలో
# అమరావతి ఆలయాభివృద్ధి



- రెండు దశల్లో రూ.260 కోట్లతో విస్తరణ పనులు
- రెండున్నరేళ్లలో పూర్తికి సన్నాహాలు
- గత ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధికి అడ్డంకులు
- రాజధానికి భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి
- అమరావతి వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ శంకుస్థాపన
- పాల్గొన్న టీటీడీ ఛైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, రైతులు

అమరావతి (చైతన్య రథం): రాజధాని అమరావతిలో రూ.260 కోట్లతో చేపట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని టీటీడీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. తిరుమల తరహాలోనే ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. రాజధానిలోని వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ పనులు రెండు దశల్లో పూర్తి కానున్నాయి. మొదటి దశలో రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం, రూ.48 కోట్లతో ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయస్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ నిర్మిస్తారు. రూ.120 కోట్లతో రెండోదశలో శ్రీవారి ఆలయ మాడవీధులు, అప్రోచ్ రోడ్లు, అన్నదాన కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులు-సిబ్బందికి క్వార్టర్స్, రెస్ట్ హౌస్, పరిపాలనా భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ సౌకర్యాలు కల్పిస్తారు.

### వేంకటేశ్వరుని కృపతోనే రాజధానికి అమరావతి నామకరణం

"దేవతల రాజధాని అమరావతే.. మనకూ రాజధానిగా ఉంటుంది. కలియుగ దైవం వేంకటేశ్వరుని ఆశీస్సులతో 2019లో అమరావతిలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాం. కృష్ణానది ఒడ్డున ఆలయం నిర్మించేందుకు 25 ఎకరాలను కేటాయించాం. రాజధానికి అమరావతి అనే నామకరణం కూడా ఆ స్వామి కృపతోనే చేశాం. ఒక పవిత్ర కార్యం సంకల్పిస్తే దానికి ఇక్కడి ప్రజలు సహకరించారు. రాజధాని నిర్మాణానికి 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలను స్వచ్ఛందంగా ఇచ్చారు. రైతులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు, అభినందనలు తెలియజేస్తున్నాను. గత ప్రభుత్వం విధ్వంసం తప్ప, ఒక్కమంచి పనీ చేయలేదు. రైతులు మంచి సంకల్పంతో భూమి ఇస్తే ఐదేళ్లు వారికి నరకం చూపించారు. కలియుగ దైవాన్నే నమ్ముకున్న రైతులు న్యాయస్థానం టూ దేవస్థానం పేరుతో మహా పాదయాత్ర చేశారు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేశారు.

### మంచి మనసుతో చేసే పనికి దేవుని ఆశీస్సులు

"నేను వేంకటేశ్వరస్వామి భక్తుడిని. మా ఇంటి దైవం ఆ స్వామియే. మా ఇంటినుంచి చూస్తే శేషాచల పర్వతం కనిపిస్తుంది. చిన్నతనంనుంచి స్వామి ఆలయం చూస్తూ పెరిగాను. స్వామికి అప్రతిష్ట కలిగించే ఏ పనీ చేయను. ఎవరినీ



చేయనివ్వను. తప్పులు చేస్తే వేంకటేశ్వరస్వామి చూస్తూ ఊరుకోడు. ఈ జన్మలోనే శిక్షిస్తాడు. స్వామివారు తన పవిత్రను తానే కాపాడుకుంటున్నారు. ముఖ్యమంత్రిని అనే హెూదాతో కాకుండా నేను తిరుమలకు కేవలం భక్తి



భావంతోనే వెళ్తాను. సామాన్య భక్తుడిగా క్యూలైన్లో వెళ్లి స్వామి దర్శనం చేసుకుంటాను. తిరుమలలో ఎన్టీఆర్ అన్నదానానికి శ్రీకారం చుడితే నేను స్విమ్స్‌లో ప్రాణదానం కార్యక్రమాన్ని ప్రారంభించాను. నాడు వేంకటేశ్వరుని సేవలో పాల్గొనేందుకు వెళ్తుంటే 23 క్లైమోర్ మైన్స్‌ను నక్సలైట్లు పేల్చారు. స్వామివారే నాకు ప్రాణభిక్ష పెట్టారు. శ్రీవారి సేవకులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తే నేడు స్వచ్ఛందంగా వేలమంది తిరుమలకు వచ్చి సేవలందిస్తున్నారు. ఇప్పుడు ఆలయాల నిర్మాణాన్ని చేపడుతున్నాం. అన్ని రాష్ట్రాల్లో శ్రీవారి దేవాలయాలను నిర్మిస్తాం. ఆలయ నిర్మాణాలకు భక్తులు కూడా ముందుకొచ్చి సహకరించాలి. ముంబయిలో రేమాండ్స్ సంస్థ రూ.100 కోట్లతో స్వామి ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తోంది. హెల్దీ, వెల్దీ, హ్యాపీ సొసైటీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు ఆ స్వామి ఆశీస్సులు ఇవ్వాలని కోరుకుంటున్నాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు సభ్యులు, రైతులు, భక్తులు పాల్గొన్నారు.








# నలుచెరగులా శ్రీవారి ఆధ్యాత్మిక వైభవం

- ఆధ్యాత్మికం, అన్నదానం, విద్య, వైద్యానికి చిరునామాగా టీటీడీ
- శ్రీవారి సేవకులుగా వైద్య నిపుణులకు అవకాశం
- వైకుంఠ ఏకాదశి దర్శనాలకు పటిష్టంగా ఏర్పాట్లు
- ప్రధాన దేవాలయాల్లో తిరుమల తరహా విధానాలు
- బోర్డు సభ్యుల కమిటీల పర్యవేక్షణలో కొత్త దేవాలయాల నిర్మాణం
- పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణకు టీటీడీ కార్యాచరణ
- తితిదేపై సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం




అమరావతి (చైతన్య రథం): ప్రపంచం నలుచెరగులా తిరుమల తిరుపతి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా కార్యక్రమాలు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీని ఆదేశించారు. ఆధ్యాత్మికం, అన్నదానం, విద్య, వైద్యానికి చిరునామాగా తిరుమల తిరుపతి దేవస్థానం మారాలని సూచించారు. గురువారం సచివాలయంలో దేవాదాయశాఖ, తిరుమల తిరుపతి దేవస్థానంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. తిరుమల ఆలయంలో అనుసరించే అత్యుత్తమ విధానాలను రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో అమలు చేసేందుకు ఆలోచన చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రసాదం తయారీ, క్యూ మేనేజ్మెంట్ సిస్టం సహా వివిధ అంశాల్లో ఈ విధానాలను అనుసరించాలని దేవాదాయశాఖకు సూచనలు చేశారు. ప్రసాదాల తయారీ కోసం ఆర్గానిక్ ఉత్పత్తులను ఎంచుకోవాలని సీఎం స్పష్టం చేశారు. తిరుమలలో భక్తుల నిర్వహణకు సంబంధించి సాంకేతికతను వినియోగించాలని పేర్కొన్నారు. భక్తులకు దర్శన సౌలభ్యం కల్పించటమే ప్రధాన లక్ష్యంగా ప్రణాళికలు ఉండాలని సూచనలు చేశారు. టీటీడీ భక్తుల పోర్టల్‌ను ఆర్టీజీఎస్‌తో అనుసంధానించాలని ఆదేశించారు.

### టీటీడీ ఆస్పత్రుల్లో అత్యుత్తమ వైద్యసేవలు


తిరుపతిలో ఉన్న ఆస్పత్రులన్నీ మోడల్‌గా అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. స్విమ్స్, రుయా, బర్డ్ ఆస్పత్రులను అనుసంధానిస్తూ మెరుగైన వసతులు కల్పించాలన్నారు. పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఆస్పత్రుల తరహాలోనే వీటి నిర్వహణ కూడా చేపట్టాలని సీఎం సూచించారు. అత్యుత్తమ వైద్య నిపుణులైన డాక్టర్లను శ్రీవారి సేవకులుగా ఆహ్వానించి ఈ ఆస్పత్రుల ద్వారా వైద్య సేవ చేసేందుకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి టీటీడీని ఆదేశించారు. అలాగే నేరుగా ఉత్పత్తిదారుల నుంచే ఔషధాలు కొనుగోలు చేసేలా చూడాలన్నారు. అత్యవసర సమయాల్లో క్యూలైన్లలోని భక్తులను వేగంగా ఆస్పత్రులకు తరలించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తిరుమలలో కాలుష్య నివారణకు ఈవీ వాహనాలు వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలను నిర్వహించాలన్నారు. అలాగే అన్ని సేవల్నీ వాట్సప్ గవర్నెన్సులోకి తీసుకువచ్చి భక్తులకు అందుబాటులో ఉంచాలన్నారు. వైకుంఠ ఏకాదశికి పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని టీటీడీకి ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. వైకుంఠ ఏకాదశికి అన్ని భాషల్లోనూ రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని సూచనలు చేశారు. వీలైనంతమంది ఎక్కువ భక్తులు దర్శనాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమల ఆధ్వర్యంలో నడిచే అన్ని దేవాలయాల్లో నిత్యాన్నదానం జరిగేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. తిరుమలలో దివ్య ఔషధవనం, బయోడైవర్సిటీ కాపాడేలా చర్యలు చేపట్టాలన్నారు. తిరుమల కొండలపై వివిధ రకాల పుష్పజాతుల మొక్కలు నాటాలన్నారు.

### కొత్తగా నిర్మించే 5 వేల దేవాలయాల రీ డిజైన్

రాష్ట్రంలో కొత్తగా నిర్మించనున్న 5 వేల దేవాలయాలను రీ డిజైన్ చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఆ దేవాలయాల్లో ఆధ్యాత్మికత, ప్రశాంతత ఉట్టిపడేలా ప్రత్యేకంగా ప్రణాళిక చేయాలని సూచించారు. వీటి నిర్మాణాన్ని పాలకమండలి సభ్యుల కమిటీ పర్యవేక్షించేలా చూడాలన్నారు. కొత్త దేవాలయాల నిర్మాణంతోపాటు రాష్ట్రంలోని పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణపై కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో 8 దేవాలయాలతోపాటు నవీ ముంబై, తమిళనాడులోని ఉలందూర్ పేటలో కొత్తగా టీటీడీ దేవాలయాలను నిర్మాణం చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కోయంబత్తూర్‌లోనూ ఆలయ నిర్మాణానికి ఓ భక్తుడు ముందుకు వచ్చారని తెలిపారు. అస్సాంలోనూ టీటీడీ ఆలయ నిర్మాణానికి 10 ఎకరాలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేటాయించారని సీఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి మరింత స్థలాన్ని కేటాయించాలని కోరనున్నట్టు తెలిపారు. దేశంలోనూ విదేశాల్లోను నిర్మించే ప్రతీ ఆలయం టీటీడీ ప్రధాన ఆలయానికి అనుసంధానం కావాలని సీఎం పేర్కొన్నారు. శ్రీవారి ధనానికి, ఆస్తులకు జవాబుదారీగా ఉండాలని ఎక్కడా దుర్వినియోగానికి చోటులేకుండా పారదర్శకంగా వాటిని నిర్వహించాలని సీఎం సూచించారు. అలాగే ఒంటిమిట్ట రామాలయంలో భక్తుల సంఖ్య పెరిగేలా విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని దేవాదాయశాఖను సీఎం ఆదేశించారు. దేవాలయాల పవిత్రతను కాపాడుతూనే ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు.

### వేగంగా భక్తుల దర్శనానికి చర్యలు

తిరుమల ఆలయానికి వచ్చే సామాన్య భక్తులకు వేగంగా దర్శనాలు జరిగేలా వినూత్న కార్యాచరణ చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం నిముషానికి 8మంది భక్తుల చొప్పున దర్శనాలు చేసుకుంటున్నట్టు టీటీడీ అధికారులు వివరించారు. పండుగలు, ప్రత్యేక సమయాల్లో సాధారణ భక్తులకే పెద్దపీట వేస్తున్నట్టు సీఎంకు తెలిపారు. దర్శనంతోపాటు కాటేజీ బుకింగ్ ఒకేమారు జరిగేలా చూస్తున్నామని తద్వారా దుర్వినియోగం అరికట్టామని సీఎంకు తెలియచేశారు. లడ్డూ నాణ్యతను గణనీయంగా పెంచటంతోపాటు అన్న ప్రసాదంలో వడ కూడా అందిస్తున్నామని తెలిపారు. కిచెన్‌ను కూడా ఆటోమేషన్ చేసి 2.75 లక్షలమందికి అన్న ప్రసాదం చేసేలా ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణను అడ్డా తరహా యాప్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు వివరించారు. తిరుమలలో కాటేజీలు, వీధుల పేర్లను కూడా పురాణాలు, క్షేత్ర పాశస్త్యం వచ్చేలా పెట్టనున్నట్టు అధికారులు వివరించారు. సమీక్షకు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈఓ వెంకయ్య చౌదరి, పాలకమండలి సభ్యులు హాజరయ్యారు.



*ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా నియమితులైన సీనియర్ జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకుడు, రచయిత పూల విక్రమ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా సీఎం చంద్రబాబు నాయుడిని కలిసి.. ధన్యవాదాలు చెబుతున్న దృశ్యం*

# రాపిడోతో టూరిజం టైఅప్!

- దేశంలోనే తొలిసారిగా 'డ్రైవర్-కం-గైడ్' సేవలు
- త్వరలోనే విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలో సేవలకు సన్నాహాలు

అమరావతి (చైతన్య రథం): పర్యాటకులకు ఆంధ్రప్రదేశ్ అందాలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాపిడో సంస్థ సహకారంతో దేశంలోనే తొలిసారిగా 'డ్రైవర్–కం–గైడ్' విధానాన్ని ఏపీ పర్యాటక శాఖ ఆవిష్కరించింది. సీఎం చంద్రబాబునాయుడు, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి మరియు రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి సమక్షంలో ఏపీ ప్రభుత్వానికి, రాపిడోకు మధ్య ఇటీవల విశాఖలో జరిగిన సిఐఐ సదస్సులో కుదిరిన ఒప్పందం మేరకు ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్టు ఏపీ పర్యాటక శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఎంఓయూ ద్వారా రాపిడోలో మంచి రేటింగ్ ఉన్న డ్రైవర్లను ఎంపిక చేసి, వారికి రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, ఆతిథ్యం, భద్రతపై వచ్చే నెలనుంచి పర్యాటక శాఖ ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. త్వరలోనే విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలో ఈ సేవలు ప్రారంభించ నుంది. రాపిడో యాప్‌లోనే టూరిస్ట్ ఆటోలు / క్యాబ్‌లు, పర్యాటక సర్క్యూట్ల వివరాలు అందుబాటులో ఉంటాయి. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లలో పర్యాటకుల సౌకర్యార్థం ప్రత్యేక కో–బ్రాండెడ్ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి పర్యాటక సేవలను సులభతరం చేయనుంది. దీనివల్ల క్యాబ్, ఆటో డ్రైవర్లకు ఆదాయం కూడా పెరుగుతుంది. టెక్నాలజీ సాయంతో పబ్లిక్– ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్, పర్యాటక రవాణాలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం భారతదేశంలోనే మొట్టమొదటి కార్యక్రమం కాగా, ప్రపంచవ్యాప్తంగా అరుదైన కార్యక్రమాల్లో ఒకటిగా నిలవనుందని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



# ప్రజా ప్రయోజనాలే అభివృద్ధి అజెండా






- **పార్లమెంట్‌లో రాష్ట్ర అంశాలు ప్రస్తావించండి**
- **ప్రాజెక్టులకు అనుమతులు - రైతు సమస్యలకు పరిష్కారం ముఖ్యం**
- **టీడీపీపీ సమావేశంలో ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం**

అమరావతి (చైతన్య రథం): అత్యధిక యువ పార్లమెంటేరియన్లు కలిగిన పార్టీ టీడీపీ అని, ఈ యువశక్తి పార్లమెంట్ వేదికగా రాష్ట్ర సమస్యలను స్పష్టంగా వినిపించాల్సిన అవసరం ఉందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టీడీపీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు సేవ చేయడమే టీడీపీ ఐడియాలజీగా పేర్కొన్న ముఖ్యమంత్రి... రాష్ట్రాభివృద్ధి, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఎంపీలు అంతా సమన్వయంతో కలసి పనిచేయాలని సూచించారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి రానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎంపీలు అనుసరించాల్సి వ్యూహంపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. మొంథా తుఫాన్ నష్టపరిహారం త్వరగా రాష్ట్రానికి అందేలా చూడాలని చెప్పారు.

### కేంద్రాన్ని ఒప్పించేలా చర్చించాలి

కృష్ణా- గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా, గోదావరి ట్రైబ్యునల్, సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై కేంద్రాన్ని ఒప్పించేలా పార్లమెంట్‌లో రాష్ట్ర గొంతుకను వినిపించాలని ఎంపీలకు సూచించారు. వంశధార-గోదావరి-నల్లమల సాగర్ అనుసంధానం, వెలిగొండ, ఉత్తరాంధ్ర జల ప్రాజెక్టులు ఇవన్నీ రాష్ట్ర భవిష్యత్‌ని నిర్ణయిస్తాయని... నీటి భద్రతే మన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం వివరించారు. పోలవరం ప్రాజెక్టును 2027 జూన్‌లో జాతికి అంకితం చేసేందుకు కేంద్ర సహకారాన్ని కోరాలన్నారు. పత్తి, మొక్కజొన్న, అరటి ధరల పతనం, సీసీఐ నియమాల కారణంగా వచ్చిన సమస్యలను కేంద్రానికి వివరించి రైతులకు ఉపశమనం కల్పించేలా చూడాలని ఎంపీలకు సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు పంటల మార్పిడికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని... అలాగే హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులు ఆకట్టుకునేలా ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు.

### అభివృద్ధిపై స్పష్టమైన రోడ్‌మ్యాప్

సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, డేటా సెంటర్లకు అవసరమైన శక్తి వసతులపై కేంద్ర సహాయం సాధించాలి. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు, 4జీ, 5జీ కనెక్టివిటీ, క్వాంటం వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌కు మద్దతు సాధించేలా ఎంపీలు కృషి చేయాలి. విశాఖ-విజయవాడ మెట్రో రైలు, విశాఖ-తిరుపతి-అమరావతి ఎకనామిక్ రీజియన్స్, భోగాపురం ఎయిర్‌పోర్ట్, విశాఖ రైల్వే జోన్, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌వంటి అంశాలపై కేంద్రంతో చురుకైన చర్చలు జరపాలి. పీపీపీ మోడల్‌లో తీసుకొస్తున్న మెడికల్ కాలేజీలు పూర్తిగా ప్రభుత్వ ఆస్తులేనని, 70 శాతం సేవలు ఉచితమని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. ప్రతి పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్, విద్యార్థుల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించే కార్యక్రమాలపై ఎంపీల సహకారం అవసరం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

### ప్రజల మధ్య ఎంపీలు ఉండాలి

పార్లమెంటులో చురుగ్గా ఉండటంతోపాటు, తమ తమ నియోజకవర్గాల్లో పేదల కోసం జరుగుతున్న 'పేదల సేవలో' వంటి కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీలకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. టీడీపీలో ఉన్న యువ పార్లమెంటేరియన్లు ప్రజలకు నమ్మకం కలిగించాలని సూచించారు. ప్రజాసేవే మనం అనుసరించాల్సిన మార్గమని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రాభివృద్ధి, రైతుల సంక్షేమం, నీటి భద్రత, టెక్నాలజీ పురోగతి, పారిశ్రామిక పెట్టుబడులు ఈ అంశాలన్నింటిని పార్లమెంటులో ప్రస్తావించి, రాష్ట్రానికి వీలున్నంతలో ఎక్కువ ప్రయోజనం చేకూర్చడమే అజెండాగా పెట్టుకోవాలన్నారు.

### ప్రజలకు చేసింది చెప్పుకోవాలి.. విజిబిలిటీ ఉండాలి

పార్టీ కార్యక్రమాల్లో ఎంపీలు క్రియాశీలకంగా ఉండాలని సీఎం తేల్చిచెప్పారు. ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాల్ని ఎప్పటికప్పుడు చెప్పుకోవాలని సూచించారు. అందరికీ అందుబాటులో ఉండాలని సూచించారు. పార్లమెంటు చర్చల్లో భాగస్వాములు కావాలన్నారు.

కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చిన ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కేవలం 17 నెలల్లోనే అభివృద్ధిని గాడిలో పెట్టగలిగామని సీఎం వ్యాఖ్యానించారు. గత పాలకుల విధ్వంసం కారణంగా ఏపీకి మరికొంత కాలం ఇబ్బందులు తప్పవని... అయితే రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడుపుతామని స్పష్టం చేశారు. లాజిస్టిక్స్ కార్పొరేషన్ ద్వారా రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నామని వివరించారు. అటు పరిశ్రమలకు వినూత్నంగా ఎస్క్రో ఖాతా ద్వారా ప్రోత్సాహకాలను రియల్ టైమ్‌లో వేసేలా నిర్ణయం తీసుకున్నామని అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మరో మెట్టుగా ఎస్క్రో అకౌంట్ నిలుస్తుందన్నారు. ఎంపీలు రాజకీయంగా నియోజకవర్గంలో గుడ్ విల్ సంపాదించాలని సీఎం సూచించారు.

అనవసరపు వివాదాల జోలికి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. వివాదాలతో ఎంపీలకు వ్యక్తిగతంగానూ.. పార్టీకి కూడా నష్టం కలుగుతుందని హితవు పలికారు. ప్రజాప్రతినిధుల పనితీరుపై ప్రతీవారం వేర్వేరు మార్గాల ద్వారా సమాచారం తెప్పించుకుని బేరీజు వేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### ప్రశ్నల్లో ప్రజాహితమే ముఖ్యం: లోకేష్

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... గత పాలకులు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో కేవలం 42 శాతం సీట్లు మాత్రమే విద్యార్థులకు ఇస్తామని అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కనీసం 50 శాతం సీట్లు కేటాయిస్తున్నట్టు చెప్పారు. ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించడమే తమ లక్ష్యంగా వివరించారు. పార్లమెంట్‌లో అడిగే ప్రశ్నలు ప్రజాహితంగా, రాష్ట్రానికి ప్రయోజనం కలిగించేలా ఉండాలన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు పాల్గొన్నారు.





*రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం రాత్రి భోజనానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉండవల్లిలోని సీఎం నివాసానికి వచ్చిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో పాటు నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి స్వాగతం పలికారు. అమరావతిలో శుక్రవారం జరిగే బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన నిర్మలా సీతారామన్...ముఖ్యమంత్రితో ఆయన నివాసంలో భేటీ అయ్యారు.*

# మీకు న్యాయం.. నా బాధ్యత

- రాజధాని ఫలాలు తొలిగా అమరావతి రైతులకే దక్కాలి
- రాజధానిని గుర్తిస్తూ నోటిఫికేషన్‌ను కేంద్రాన్ని కోరాం
- క్యాపిటల్ గెయిన్స్ గడువు పొడిగింపుపై చర్చిస్తాం
- అమరావతి రైతులతో సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం
- రెండోవిడత ల్యాండ్ పూలింగ్‌కు సానుకూలమేనన్న రైతులు
- అమరావతి డెవలప్‌మెంట్ సోసియేషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- సీఎం దృష్టికి తీసుకొచ్చిన అమరావతి రైతాంగం



అమరావతి (చైతన్య రథం): అమరావతిని రాజధానిగా గుర్తించాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరామని... ఈ అంశంపై కేంద్రంతో మరోసారి చరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాజధాని రైతులకు క్యాపిటల్ గెయిన్స్ గడువును మరికొంత కాలంపాటు పొడిగించే అంశంపైనా కేంద్రంతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. గురువారం రాజధాని రైతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలోని ఐదో బ్లాకులో సమావేశమయ్యారు. రైతుల తమకున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... 'జరీబు, గ్రామ కంఠాలు, లంక భూములు,రిటర్నబుల్ ప్లాట్లల్లో మౌలిక సదుపాయాల కల్పనపై రైతుల అభిప్రాయాలు నా దృష్టికి వచ్చాయి. లంక భూములను పూలింగ్ తీసుకోవడానికి అనుమతి ఇచ్చాను. ఇంకా ఏమైనా సమస్యలుంటే ముందుగా త్రిసభ్య కమిటీతో చర్చించండి. అవసరమైతే నేనూ మీతో మాట్లాడతాను. ఇకపై రెగ్యులర్‌గా అమరావతి రైతుల సమస్యలపై సమీక్షిస్తాను" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### రైతులకు అన్నీ చెప్పాలి... మనసువిప్పి మాట్లాడుతున్నా

"రైతులతో మనస్సు విప్పి మాట్లాడాలి, కాబట్టి అన్నీ చెబుతున్నా. అమరావతే రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్‌గా ఉండాలి. రాజధాని అభివృద్ధి చెందాలి. ఇక్కడ జరిగిన అభివృద్ధి ఫలాలను రాజధాని రైతులే ముందు అందుకోవాలి. అమరావతి ప్రాంతానికి... రాజధాని రైతులకు న్యాయం చేయడం నా బాధ్యత. నా హయాంలో ఎప్పుడూ భూసేకరణలో ఇబ్బందులు రాలేదు. భూముల ధరలు పెరగబోతున్నాయి. రిటర్నబుల్ ప్లాట్లను రైతులు అమ్ముకోవద్దు. తిరుమల తరహాలో అమరావతి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం. బిట్స్ పిలానీ, క్వాంటం వ్యాలీ ఏర్పాటవుతున్నాయి. అద్భుతమైన అభివృద్ధి జరగబోతోంది. తిరుపతి సమీపంలో 5 వేల ఎకరాలు ప్రభుత్వానికి లభించింది. అక్కడ ఎరో స్పేస్ సిటీని ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలో ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉంది. రెండో విడతలోనూ ల్యాండ్ పూలింగులో భూములు తీసుకుని అభివృద్ధి చేద్దామని చూస్తున్నాం. అభివృద్ధి ఫలాలు ఎలా ఉంటాయో హైదరాబాద్‌ను చూస్తే అర్ధమవుతుంది. గతంలో అక్కడ చాలా తక్కువ ధరలో ఉండే భూములు ఇప్పుడు ఎకరం రూ.170 కోట్లకు చేరింది. కొందరు రైతులు ఎఫ్ఎస్ఐ పెంచాలని కోరుతున్నారు. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటాను. రైతులు చెప్పే ఏ సమస్యనైనా వీలైనంతవరకు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అలాగే అందరూ కలిసి కట్టుగా ఉండాలి. ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

### రెండో విడత ల్యాండ్ పూలింగ్‌కు సహకరిస్తాం: రాజధాని రైతులు

సీఎంతో సమావేశం సందర్భంగా రైతులు మాట్లాడుతూ...'రాజధాని కోసం జేఏసీలు ఏర్పాటు చేసుకుని ఉద్యమించాం. ఇక అమరావతి డెవలెప్ మెంట్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుంటాం. రెండో విడత భూసమీకరణకు పూర్తిగా సహకరిస్తాం. సీఎం రూపొందించిన ప్రణాళికప్రకారం ముందుకెళ్తే మాకూ మేలు జరుగుతుంది. ల్యాండ్ పూలింగ్ ఇవ్వని వారిని పిలిపించి మాట్లాడితే సమస్య త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఎఫ్ఎస్ఐ పెంపువల్ల కలిగే లాభ నష్టాలను వివరించే బాధ్యత సీఆర్డీఏ తీసుకోవాలి. రైతులకు కొన్ని అంశాల్లో సరైన అవగాహన లేదు. ఏదైనా ఇబ్బంది అయితే నష్టంరైతులకే కలుగుతుంది" అని రైతులు సీఎంతో చెప్పారు. సమావేశంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, మున్సిపల్, సీఆర్డీఏ శాఖల ఉన్నతాధికారులు, గుంటూరు జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

# ఎన్టీఆర్, ఎంఎస్ఎస్ విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి లోకేష్



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరు సెంటర్‌లో ఏర్పాటుచేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు, మాజీ మంత్రి స్వర్గీయ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు విగ్రహాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గురువారం ఆవిష్కరించారు. ముందుగా ఆత్మకూరు సెంటర్‌కు చేరుకున్న మంత్రి లోకేష్‌కు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్, ఎంఎస్ఎస్ విగ్రహాలను మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ఈ వేడుకకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు,



గ్రామ అధ్యక్షులు తాటి వెంకట్రావు, మండల టీడీపీ ఉపాధ్యక్షులు కొమ్మా సుకుమార్, మాదాల సునీల, నన్నపనేని నాగేశ్వరరావు, కొమ్మా లవ్ కుమార్, టి.ఏసు రత్నం, టి.ఏసుదాస్, టి.యేసోబు, టి.పన్నయ్యతో పాటు పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.





# రాజధానిలో ఎల్ఐసీ, 15 బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు నేడు శంకుస్థాపన

**కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా..**

అమరావతి (చైతన్య రథం): రాజధాని అమరావతిలో మరో ముందడుగు పడుతోంది. దేశంలోని ప్రముఖ బ్యాంకులు, బీమా సంస్థలు తమ రాష్ట్ర ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. 15 బ్యాంకులు, బీమా సంస్థలు ఈమేరకు భవనాల నిర్మాణాన్ని చేపడుతున్నాయి. వీటికి శుక్రవారం ఉదయం 11.22 గంటలకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుంది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీ కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, నాబార్డ్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఎల్ఐసీ, న్యూ అస్యూరెన్స్ ఇండియా కంపెనీ లిమిటెడ్ (ఎన్ఐఏసీఎల్) తమ కార్యాలయాలకు శంకుస్థాపన చేస్తున్నాయి. రూ.1,334 కోట్లతో ఈ కార్యాలయాలు నిర్మిస్తున్నారు. కార్యక్రమానికి ఆయా బ్యాంకుల, బీమా సంస్థల ప్రతినిధులు, మంత్రులు, రాజధాని రైతులు హాజరుకానున్నారు.

చైతన్యరథం




# మంగళగిరిలో మోడల్ పబ్లిక్ లైబ్రరీని ప్రారంభించిన మంత్రి నారా లోకేష్

## - లైబ్రరీ ఆధునీకరణకు రూ.1.72 కోట్ల వ్యయం



మంగళగిరి (చైతన్యరథం): అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కృషిచేస్తున్నారు. మంగళగిరి పట్టణం శివాలయం వద్ద రూ.1.72 కోట్లతో ఆధునీకరించిన మోడల్ పబ్లిక్ లైబ్రరీని గురువారం మంత్రి లోకేష్ ప్రారంభించారు. 1986లో ముఖ్యమంత్రి హోదాలో స్వర్గీయ ఎన్టీఆర్, మాజీ మంత్రి స్వర్గీయ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం పేరుతో మంగళగిరిలో లైబ్రరీకి శంకుస్థాపన చేశారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో మంత్రి లోకేష్ చొరవతో లైబ్రరీని ఆధునీకరించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు.

లైబ్రరీ ఆధునీకరణకు సీఎస్ఆర్ ఫండ్స్ కింద గుంటూరు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ రూ.90 లక్షలు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్(ఏపీటీఎస్) రూ.42 లక్షలు, నోవో(NOVO) ఇన్సూరెన్స్ బ్రేకింగ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.30 లక్షలు అందించారు. లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో పిల్లల కోసం రీడింగ్ రూమ్, ప్లే ఏరియా, వివిధ దిన పత్రికలు, వార, మాసపత్రికలు అందుబాటులో ఉండే విధంగా రూమ్, బుక్ రీడింగ్ రూమ్, సీనియర్ సిటిజన్స్ రీడింగ్ ఏరియా, పబ్లిక్ రీడింగ్ ఏరియా, ఫలహారశాలతో పాటు మొదటి అంతస్తులో రెండు టీచింగ్ హాల్స్, స్టడీ రూమ్, నైపుణ్యంతో పాటు పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే వారికోసం రీడింగ్ ఏరియా, డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ రీసోర్స్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు.

### ఎన్టీఆర్ వేసిన శిలాఫలకం వద్ద సెల్ఫీ దిగిన మంత్రి లోకేష్

మోడల్ పబ్లిక్ లైబ్రరీ ప్రారంభోత్సవం సందర్భంగా 1986లో స్వర్గీయ ఎన్టీఆర్ వేసిన శిలాఫలకం వద్ద మంత్రి నారా లోకేష్ సెల్ఫీ దిగారు. లైబ్రరీ మొత్తం కలియతిరిగి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో ఫోటోలు దిగారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్ రాజశేఖర్, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో పాటు పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


























# కొండపనేని టౌన్‌షిప్ పార్క్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్




మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి బైపాస్‌లోని కొండపనేని టౌన్ షిప్ వద్ద రూ. 1.23 కోట్ల వ్యయంతో 0.65 ఎకరాల్లో ప్రభుత్వం నూతనంగా అభివృద్ధి చేసిన కొండపనేని టౌన్ షిప్ పార్క్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు.

ఈ పార్క్‌లో అత్యాధునిక సౌకర్యాలను ఏర్పాటుచేశారు. ప్లాజా, వాకింగ్ ట్రాక్, ఇంటర్నల్ పాత్ వేస్, స్టేజ్, యోగా డెక్, సీనియర్ సిటిజన్ సీటింగ్ ఏరియా, ఔట్ డోర్ జిమ్ ఏరియా, మోడ్రన్ లైటింగ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, లాన్ ఏరియాలను ఏర్పాటుచేశారు. పార్క్‌లో వసతులను ఈ సందర్భంగా మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో పాటు పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.








# అభివృద్ధి, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి లోకేష్

## - మంగళగిరిలో సత్యభామ సిల్క్స్ అండ్ హ్యాండ్ లూమ్స్ షోరూమ్‌ను ప్రారంభించిన మంత్రి

మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలో వివిధ అభివృద్ధి, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో గురువారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. మంగళగిరి పట్టణం రాజీవ్ సెంటర్‌లో బిట్ర తులసీరామ్, అందె వీరాంజనేయులు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన సత్యభామ సిల్క్స్ అండ్ హ్యాండ్ లూమ్స్ షోరూమ్‌ను మంత్రి లోకేష్ ప్రారంభించారు.



ఈ సందర్భంగా మంత్రి లోకేష్‌కు నిర్వాహకులు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. చేనేత చీరలను కొనుగోలు చేశారు. అందరి తో ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తోపాటు పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మతం ఏదైనా మానవత్వం ముఖ్యం





- అవకాశాలను సద్వినియోగంతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు
- అందరూ రాష్ట్ర, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- మెరుగైన సమాజం కోసం నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉంది
- మంగళగిరిలో నూర్ మస్జీద్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్



మంగళగిరి (చైతన్యరథం): మతం ఏదైనా మానవత్వం ముఖ్యమని, భవిష్యత్ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఉద్బోధించారు. మంగళగిరి ఆర్టీసీ డిపో వద్ద పావురాల కాలనీలో నూతనంగా నిర్మించిన నూర్ మస్జీద్‌ను గురువారం మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరి ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు దక్కిందన్నారు. నాకున్న అవకాశాల మేరకు సేవ చేస్తున్నా. సీఎం చంద్రబాబునాయుడుకి రాష్ట్రానికి సేవ చేసే అవకాశం దక్కింది. మనతో ఉన్నవారిని పైకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉంది. మతం ఏదైనా మానవత్వం మర్చిపోకూడదు. కష్టాల్లో ఉన్నవారికి చేయూత అందించాలి. సమాజంలో ఇంకా పేదరికం ఉంది. పేదరికంలో ఉన్నవారిని అందులో నుంచి బయటకు తీసుకురావాలని మంత్రి లోకేష్ అన్నారు.

### అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ, పట్టుదల చాలా అవసరం. 2019లో దేవుడు నాకు పరీక్ష పెట్టాడు. నన్ను అనేక మంది ఎగతాళి చేశారు. అదే దేవుడు నాకు శక్తి కూడా ఇచ్చాడు. క్రమశిక్షణ, పట్టుదలతో పనిచేస్తే విజయం దక్కుకుంది. మనందరికీ దేవుడు శక్తి ఇచ్చాడు. దానిని వినియోగించుకోవాలి. కష్టాలు అందరికీ ఉంటాయి. వాటిని అధిగమించాలి. అందరూ రాష్ట్ర, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి. కాలం మారింది. అందరూ చదువుకోవాలి. భవిష్యత్ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి లోకేష్ ఉద్బోధించారు.

### మెరుగైన సమాజం కోసం..

2047 నాటికి దేశాన్ని అగ్రపథాన నిలిపేందుకు ప్రధాని మోదీ కృషిచేస్తున్నారు. మెరుగైన సమాజం కోసం నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉంది.మహిళలను గౌరవించాలి. దేవుడు నాపై పవిత్ర బాధ్యత పెట్టాడు.దానినినెరవేర్చాల్సిన అవసరంఉంది. మన మధ్య చిచ్చు పెట్టేందుకు చాలామంది ప్రయత్నిస్తారు. ప్రశాంతంగా ఉండాలి. బాగా పని చేశారని ప్రజలు గుర్తించినప్పుడు నాకు కొండంతబలం. అందరికీ అండగా ఉంటా. కలిసికట్టుగా పని చేద్దామని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు,టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో పాటు హాజీ షేక్ నాగుల్ మీరా,మసీదు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ, మసీదు కమిటీ సభ్యులు షేక్ మహమ్మద్ జానీ, మహమ్మద్ ఫిరోజ్, షేక్ సౌఖత్ అలీ, షాహిద్ అలీ, జాఫర్, నజీర్, ఆసిఫ్, అబ్దుల్లా కుట్టి, పలువురు స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.








## మంగళగిరి ఆటోనగర్‌లో బిస్మిల్లా మటన్ హౌస్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్

మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి ఆటోనగర్‌లో మహమ్మద్ అలీ గౌస్, సయ్యద్ హుస్సేన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బిస్మిల్లా మటన్ హౌస్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గురువారం ప్రారంభించారు. ముందుగా ఆటోనగర్‌కు చేరుకున్న మంత్రి లోకేష్‌కు నిర్వాహకులు, స్థానిక టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం బిస్మిల్లా మటన్ హౌస్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో పాటు పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## పాటలతో సులువుగా
# లెక్కల బోధన

**- ప్రభుత్వ టీచర్‌కి మంత్రి లోకేష్ అభినందనలు**

అమరావతి (చైతన్యరథం): పాటల ద్వారా పిల్లలకు ఆసక్తి కలిగించేలా లెక్కలు బోధిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గణితంను సంగీతంలా మార్చి, లేటెస్ట్ పాటల



బాణీల్లో పాఠాలు చెబుతూ ట్రెండ్ సృష్టిస్తున్నారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం, వెదురుపాక సావరంలోని ఎంపీయూపీ స్కూల్లోని మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ పాలెపు నాగేశ్వరరావు మాస్టారు. Maths made easy with MUSIC పద్ధతిని ఫాలో అవుతూ, గణితానికి సంగీతాన్ని జోడించిన విధానం వినూత్నంగా ఉంది మాస్టారు. మేథ్స్ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేసి, విద్యార్థులకు నేర్పించడం ప్రశంసనీయం. గణితంపై పేరడీ పాటల ద్వారా అవగాహన కల్పిస్తూ, నేర్పిస్తూ, వాటిని సోషల్ మీడియా ద్వారా మరింత ప్రచారం కల్పిస్తోన్న నాగేశ్వరరావు మాస్టారికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## గురుకుల పాఠశాలలో
# మీ పర్యటన ఉత్తేజభరితం

**- పిల్లలకు జీవితంలో మరపురాని అనుభవం**
**- డేవిడ్ బెక్‌హామ్‌కు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు**

మంగళగిరి (చైతన్యరథం): వైజాగ్ సమీపంలోని కొత్తవలసలో ఏపీ ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించినందుకు ఇంగ్లాండ్‌కు చెందిన లెజెండరీ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, UNICEFIndia గుడ్‌విల్ అంబాసిడర్ డేవిడ్ బెక్‌హామ్‌కు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు. విద్యార్థులతో మమేకమై ఆయన జరిపిన హృదయపూర్వక సంభాషణలు, అందించిన ప్రోత్సాహం, ఉల్లాసభరితమైన ఆయన ప్రవర్తన మొత్తం తరగతి గదులను, ఆట స్థలాన్ని ఉత్తేజ భరితం చేశాయి. విద్యార్థులతో ఆయన గడిపిన ప్రతి క్షణం వారికి జీవితంలో మరపురాని అనుభవంగా మారింది. ఆటపాటలతో కూడిన ఉత్సాహం పాఠశాల వాతావరణాన్ని ఉత్సవంలా మార్చింది. పిల్లల కలలు, విద్య, భవిష్యత్తు పట్ల మీ నిబద్ధతకు కృతజ్ఞతలు అని మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు.



## కట్టె కాలేవరకు...
# పసుపు జెండాతోనే..!



*(చైతన్యరథం ప్రతినిధి, అమరావతి)*

చిత్తూరు జిల్లా మారుమూల కుగ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన జన్మించిన అనిమిని రవినాయుడు తెలుగుదేశంపార్టీలో అంచెలంచెలుగా ముందుకుసాగి ఉన్నతస్థానానికి చేరుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలివిడతలోనే శాప్ చైర్మన్ పదవిని పొందిన రవినాయుడు ఒకవైపు అధికారిక బాధ్యతలు నిర్వహిస్తూనే... మరోవైపు పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. తన కట్టె కాలేవరకు తాను పసుపు జెండా నీడలోనే సేవ చేస్తానని, తెలుగుదేశం పార్టీ కార్యకర్త పదవే అన్నింటికంటే పెద్దదని ఆయన చెబుతున్నారు. రవినాయుడు అంతరంగం ఆయన మాటల్లోనే....!

### మీ రాజకీయ నేపథ్యంలో ఏమిటి?

చంద్రగిరి మండలం కొటాల గ్రామంలో సాధారణ రైతు కుటుంబం మాది. మా అమ్మమ్మగారి ఊరు నారా వారిపల్లె. చంద్రబాబుగారిని చూస్తూ పెరిగిన నేను ఆయన నుంచి స్ఫూర్తి పొంది రాజకీయాల్లోకి వచ్చాను. 2004లో విద్యార్థి రాజకీయాలతో నా ప్రస్థానం మొదలైంది. తొలుత తిరుపతి ఓరియంటల్ కళాశాలలో యూనియన్ ప్రెసిడెంట్ గా పనిచేశాను. డిగ్రీ కళాశాలలో మెస్ సెక్రటరీగా, యూనివర్శిటీలో టిఎన్ఎస్ ఎఫ్ జనరల్ సెక్రటరీగా, యూనివర్శిటీ టిఎన్ఎస్ఎఫ్ ప్రెసిడెంట్ గా విద్యార్థుల సమస్యలపై పోరాడాను. టిఎన్ ఎస్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, టిఎన్ఎస్ఎఫ్ నేషనల్ కోఆర్డినేటర్ గా, తెలుగుయువత తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడిగా పనిచేశాను. తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, కార్యక్రమాల కోఆర్డినేటర్ గా పార్టీకి నావంతు సేవలందించాను.

### మీ అభిమాన నేత ఎవరు, ఎందుకు?

రాజకీయాల్లో చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్ ఇద్దరూ నా అభిమాన నాయకులు. సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టి, అసమాన నాయకత్వ లక్షణాలతో ఆయన అంచెలంచెలుగా ఎదిగిన తీరు, ఆయనలోని పట్టుదల, క్రమశిక్షణ నన్ను ఆకట్టుకున్నాయి. ఆయన విజన్ నేడు రాష్ట్రంలోని యువరక్తానికి రోల్ మోడల్ గా నిలుస్తోంది. ఏ నేపథ్యం లేకుండా స్వయం కృషితో ముఖ్యమంత్రి స్థాయికి చేరారు. యువనేత లోకేష్ విశ్వసనీయత, నమ్మిన వారి కోసం ఎంతదూరమైన వెళ్లే మనస్థత్వం నాకు ఇష్టం. లోకేషన్న కేడర్ పై చూపి ప్రేమ, నమ్మిన వారి కోసం ఎందాకైనా వెళ్లే మనస్థత్వం, కొత్తనాయకులను ప్రోత్సహిస్తున్న విధానం కేడర్ లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

### యువగళం పాదయాత్రలో మీ అనుభవం?

యువగళం పాదయాత్ర నా జీవితంలో ఒక మరపురాని ఘట్టం. రాముడి వెంట హనుమంతుడిలా రాష్ట్రం కోసం లోకేషన్న వెంట మేం ముందుకు సాగాం. పాదయాత్రలో ఆయన చెప్పింది చేయడమే నా కర్తవ్యం. పాదయాత్రాలో మూడు సంఘటనలు నన్ను బాధించాయి. బంగారుపాళ్యం మైకుతో స్టూల్ కూడా లాక్కుని ఇబ్బంది పెట్టి రెచ్చగొట్టి, యాత్రను భగ్నం చేయాలని చూశారు. అయితే లోకేషన్న మాతో ఎటువంటి కవ్వింపు చర్యలు వద్దు, మనం రాజ్యాంగాన్ని నమ్మాం, ఆ ప్రకారమే ముందుకుసాగుదాం అని దిశానిర్దేశం చేశారు. వైసిపి నాయకులు, పోలీసులు ప్రతిచోటా కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఎప్పుడు ఎవరువచ్చి దాడిచేస్తారో




తెలియని స్థితిలో మా వెనుక అన్న ఉన్నాడన్న ధైర్యంతో ముందుకు సాగాం.

ఒక్కమాటలో చెప్పాలంటే ప్రతరోజు యుద్ధమే చేశాం. యాత్ర భీమవరం చేరాక ఊహకందని సంఘటన జరిగింది. వైసిపి వారే ఫ్లెక్సీలు చించేసి, మా వాలంటీర్ల తలలు పగులగొట్టి, మూడు ఎఫ్ ఐఆర్ లు కట్టారు. ఓవైపు బాబు గారిని అక్రమంగా జైలులో పెట్టి, మరోవైపు మ వాలంటీర్లను పశువుల్లా లాక్కెళ్లి గోడౌన్ లో పడేశారు. వాటన్నింటి కంటే బాబుగారి అరెస్టే మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. ఆ సమయంలో నెలరోజులు లోకేషన్న పడిన మదనం మమ్మల్ని కదిలించింది. అది చూశాక ఆయన కోసం ఎందాకైనా వెళ్లాలని నిర్ణయించుకున్నాం.

### మీకు తగిన గుర్తింపు లభించిందా?

సాధారణ కార్యకర్తనైన నా పేరును మొదటి లిస్టులోనే ప్రకటించడం ఆనందం కలిగించింది. తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికి తగిన గౌరవం, గుర్తింపు లభిస్తాయనడానికి నేనే ఉదాహరణ.

ఇప్పుడు లభించిన పదవి కంటే తెలుగుదేశం పార్టీ కార్యకర్త పదవే అతి పెద్దది. నా కట్టె కాలేవరకు పసుపుజెండా వెంటే ఉండి సేవలందిస్తాను.

### 18నెలల కూటమి పాలన ఎలా ఉంది?

సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన విజనరీ లీడర్ చంద్రబాబు గారు అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఇచ్చిన ప్రతిమాట నిలబెట్టుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక యువతలో కొత్తఆశలు చిగురించాయి. విద్యామంత్రి లోకేష్ కేవలం 150 రోజుల్లో రికార్డు సమయంలో డిఎస్సీ పూర్తిచేసి 16,347 టీచర్ పోస్టులు భర్తీచేశారు. రాష్ట్రానికి పరిశ్రమల వరద మొదలైంది. కేవలం 17నెలల్లో రూ. 23.5లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. మరో 15ఏళ్లు కూటమి పాలన కొనసాగితే ప్రపంచంలోనే ఎపి నెం.1 స్థానంలో నిలుస్తుంది. యువనేత నారా లోకేష్ యూత్ ఐకానిక్ గా నిలుస్తూ పెట్టుబడుల సాధన కోసం జెట్ స్పీడ్ తో ముందుకు సాగుతున్నారు.

### ప్రజల సంతృప్తిగా ఉన్నారా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలు నూటికి నూరుశాతం సంతృప్తిగా ఉన్నారు. తల్లికివందనం, పెన్షన్ల పెంపు, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ, దీపం-2 పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలండర్ల పంపిణీ వంటి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే దిశగా చంద్రబాబు గారి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది.

### పార్టీ కేడర్ అంతరంగం ఎలా ఉంది?

ఇదివరకెన్నడూ లేనివిధంగా పార్టీ గత ఎన్నికల్లో ఘనవిజయం సాధించడంతో పార్టీ కేడర్ లో సహజంగానే కేడర్‌లు ఆశలు, ఆకాంక్షలు ఎక్కువగా ఉన్నాయి. పార్టీ ఆవిర్భవించిన తర్వాత 45ఏళ్లలో లేనివిధంగా గత అయిదేళ్లలో పార్టీ కార్యకర్తలు కష్టాలు అనుభవించారు. చాలామంది జైలుకెళ్లారు, ఆస్తులు పోగొట్టుకున్నారు. వారికి న్యాయం చేసేవిధంగా యువనేత లోకేష్ అడుగులు వేస్తున్నారు. కొంచెం ఆలస్యం కావచ్చేమో కానీ అందరికీ తప్పక న్యాయం జరుగుతుంది. అయితే గత అయిదేళ్లలో తమను ఇబ్బంది పెట్టిన వారికి తగిన శిక్ష పడాలని కేడర్ కోరుకుంటున్నారు. ఈ విషయంలో మరింత క్రియాశీలకంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. వైసిపి నేతల కబ్జాల్లో భూములను విడిపించి,సాధ్యమైనంత త్వరగా వాస్తవ లబ్ధ దారులకు అందించాలని కోరుకుంటున్నాను.

# గంగానమ్మ తల్లి ఆలయంలో మంత్రి లోకేష్ పూజలు



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరులో స్వర్గీయ ఎన్టీఆర్, ఎంఎస్ఎస్ విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం గ్రామంలోని శ్రీ గంగానమ్మ తల్లి దేవాలయాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సందర్శించారు. అమ్మవారిని దర్శించు కుని మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తోపాటు పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# మొక్కజొన్న రైతులకు అండగా ఉంటాం

- వ్యవసాయమంత్రి అచ్చెన్నాయుడు స్పష్టీకరణ
- పౌల్ట్రీ, విత్తన సంస్థలు, ఫార్మా, ట్రేడర్లు కొనుగోళ్లు వేగవంతం చేయాలి
- మొత్తం ఉత్పత్తిలో 25% ప్రభుత్వమే సేకరిస్తుంది
- నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖకు అభ్యర్థన
- వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్



అమరావతి (చైతన్యరథం): మొక్కజొన్న రైతులకు అండగా ఉంటామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మొక్కజొన్న కొనుగోలు అంశంపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులతో మంత్రి అచ్చెన్నాయుడు విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. పౌల్ట్రీలు, విత్తనాల సంస్థలు, ఫార్మా రంగం, ట్రేడర్లు రేట్లు తగ్గించకుండా, క్వాంటిటీ తగ్గించకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. పరిశ్రమలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించేందుకు ఇప్పటికే సన్నాహాలు పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. ఖరీఫ్-2025 కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కింద మొక్కజొన్న సేకరణకు అనుమతి ఇవ్వాలని ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అలాగే సేకరణ చేపట్టేందుకు అవసరమైన నిధులను ఆర్థిక శాఖ నుంచి మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ప్రతిపాదనలు సమర్పించినట్టు చెప్పారు. ఈ సీజన్‌లో 1,42,282 హెక్టార్లలో మొక్కజొన్న సాగు జరగగా, అంచనా ఉత్పత్తి 8,18,753 మెట్రిక్ టన్నులు ఉండనుందని మంత్రి వివరించారు. రైతులను ఆదుకునేందుకు మొత్తం ఉత్పత్తిలో 25% అంటే 2,04,688 మెట్రిక్ టన్నులు ప్రభుత్వమే సేకరించేందుకు సిద్ధంగా ఉందని, ఈ క్రమంలో ధరల స్థిరీకరణ నిధి (పీఎస్‌ఎఫ్) నుండి అవసరమైన బడ్జెట్‌ను విడుదల చేయాలని ఆర్థిక శాఖను కోరినట్లు పేర్కొన్నారు.

అదనంగా, నంద్యాల జిల్లాలో ఏపీ మార్క్‌ఫెడ్, ఖీతీఖీతీ అగ్-టెక్ ప్లాట్‌ఫార్మ్, ఐఎఫ్‌సీ మద్దతుతో కొత్త మార్కెట్ అనుసంధాన పైలట్ ప్రాజెక్టు ప్రారంభించినట్లు వివరించారు. రైతులకు లాజిస్టిక్స్, నిల్వ, డిజిటల్ ట్రేసబిలిటీ, ఫండింగ్ వంటి సౌకర్యాలు అందించడానికి ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో పౌల్ట్రీ, పశువుల దాణా తయారీదారులు, స్టార్చ్ అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, డిస్టిలరీలు, ఇథనాల్-బయోఫ్యూయల్ యూనిట్లు, బూరవీరు, వాణిజ్య సంస్థలతో పెద్ద స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొక్కజొన్న వినియోగించే అన్ని పరిశ్రమలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా రైతులకు మార్కెట్ అవకాశాలు పెంచడం లక్ష్యమని చెప్పారు. మొక్కజొన్న రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతులు నష్టపోకుండా, మార్కెట్‌ను స్థిరపరిచే అన్ని చర్యలు ప్రభుత్వం వేగంగా చేపడుతోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలియజేశారు.

# ఆర్అండ్‌బీపై రూ.20 వేల కోట్ల భారం

- గత ప్రభుత్వంలో అధ్వాన స్థితికి రోడ్లు
- బాగు చేయించకుండా నిర్లక్ష్యం వహించారు
- రూ.1,061 కోట్లతో మరమ్మతులు చేయించాం
- వచ్చే మార్చి నాటికి మొత్తం పూర్తి చేస్తాం
- ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి



మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య కాలంలో శరవేగంగా రహదారులు నిర్మించి ఆర్ అండ్ బీ శాఖను అగ్రభాగాన నిలబెడితే... జగన్ ప్రభుత్వం లో రహదారులను నిర్లక్ష్యం చేసి గోతులకు మరమ్మతులు కూడా చేయకుండా రూ.20 వేల కోట్ల భారం పెట్టి వెళ్లాడని ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించా రు. ఆర్ అండ్ బీ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ సీఎం చంద్రబాబు సూచనలతో పారదర్శకంగా పనిచేస్తుందని పేర్కొన్నా రు. రోడ్డు వేసిన తర్వాత 5 ఏళ్లకు ఒకసారి మరమ్మతులు చేయా లి. కానీ జగన్ హయాంలో అలాంటివి ఏమీ చేయలేదు. 15 వేల కిమీ రహదారులు ఎందుకు పనికిరాకుండా పోయాయి. 2014-19 నవ్యాంధ్రలో 26 వేల కి.మీ సీసీ రహదారులు, 22 వేల కి.మీ బీటీ రహ దారులు పూర్తి చేశాం. 7 వేల కి.మీ జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణాలు పూర్తి చేశాం. 2014-19లో అనుమతు లు తీసుకున్న రహదారులను కూడా జగన్ తన హయాంలో నిర్వీ ర్యం చేశాడు. అప్పటి టీడీపీ హయాంలో రూ.36 వేల కోట్ల విలు వైన 5 జాతీయ రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించాం.. వైసీపీ వచ్చాక వాటిని రద్దు చేసింది. ఏఐబీతో రహదారులకు రూ.5 వేల కోట్లు తీసుకొచ్చాం. వాటిని రద్దు చేశాడు. అనంత పురం ఎక్స్‌ప్రెస్ వే ఆపేశారు. అమరావతి రింగ్ రోడ్ పనులను నిలిపివేశాడు. 30 వేల కి.మీ. రహదారులను నిర్లక్ష్యంగా మార్చే శాడని మండిపడ్డారు.

### రూ.1,061 కోట్లతో గుంతల రోడ్లకు మరమ్మతులు పూర్తి

రహదారుల నిర్మాణం, మౌలిక సౌకర్యాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గుంతల రహ దారుల మరమ్మతులు 22 వేల కి.మీ మేర రూ.1061 కోట్లతో పూర్తి చేశాం. అయినా వర్షాల వల్ల రహదారులు చాలా దెబ్బతి న్నాయి. రూ.3 వేల కోట్లతో రిపేర్లు, ఇతర మరమ్మతులు చేయా లని నిర్ణయించాం. రూ.3 వేల కోట్లతో ఈ ఏడాది రహదారులు బాగు చేయాలని నిర్ణయించాం. మార్చి నెలాఖరు నాటికి ఏపీలో గుంతల రహదారుల మరమ్మతులు మొత్తం పూర్తి చేయబోతు న్నాం. రహదారులు బాగుంటే పెట్టుబడులు కూడా వస్తాయన్న ఉద్దేశంతో శరవేగంగా పనులు చేస్తున్నాం. 175 రహదారులు 5130 కి.మీ. పూర్తి చేసేందుకు పనులు చేస్తున్నాం. త్వరలో పీపీపీ రోడ్లకు టెండర్లు పిలవనున్నామని తెలిపారు.

### మొంథా తుఫాన్ వల్ల 4,794 కి.మీ ధ్వంసం

ఈ ఏడాదిలో వచ్చిన మొంథా తుపాన్ కారణంగా రాష్ట్రంలో ఆర్అండ్‌బీ శాఖపై పెనుభారం పడింది. అప్పటివరకు అభివృద్ధి చేసిన 4,794 కి.మీ రహదారులు ధ్వంసం అయ్యాయి. ఒక్క ఆర్ అండ్ బీ శాఖపై రూ.2,774 కోట్లు భారం పడింది. వాటిని కూడా త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రహదారుల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వాడాలని సీఎం చంద్రబాబు తెలిపారు. డ్యానిష్ ఫైబర్ వంటి టెక్నాలజీని ఉపయోగించి రహదారులను పటిష్టంగా నిర్మిస్తున్నాం. బనగాన పల్లి, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో ఇప్పటికే ఈ టెక్నాలజీ ని ఉపయోగించి రహదారులు వేశాం. వాటి నాణ్యతను బట్టి ఇతర ప్రాంతాల్లో కూడా రహదారులు వేసేందుకు చర్యలు తీసుకోబోతున్నామని వివరించారు.

### వచ్చే ఏడాదికి పోర్టుల నిర్మాణం పూర్తి

రాష్ట్రాభివృద్ధికి కీలంగా ఉన్న పోర్టుల నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన మౌలిక సౌకర్యాల కల్పనకు కూటమి ప్రభుత్వంలో శరవేగంగా చర్యలు తీసుకున్నాం. మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టు ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాదికి వాటిని పూర్తి చేయబోతున్నాం. రూ.15 వేల కోట్లతో ఈ పనులు చేస్తు న్నాం. విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సులో కొన్ని ఎంఓ యూలు కుదుర్చుకున్నాం. భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం గడువుకంటే ముందే పూర్తి చేసేలా పనిచేస్తున్నాం. ఇంకా ఆరు ఎయిర్‌పోర్టులు నిర్మిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అలాగే ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి వేగంగా చర్యలు తీసుకుం టున్నాం. దేశంలోనే బెస్ట్ మౌలిక సదుపాయాలు కల్పించే రాష్ట్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

# సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి అండ

- పేదలకు వైద్యం దూరం కాకూడదనేదే సీఎం చంద్రబాబు ధ్యేయం
- సూపర్ సిక్స్ హామీలన్నీ 17 నెలల్లోనే అమలు
- జగన్‌లా ప్రజలను మోసం చేయం
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి




తూర్పునాయుడుపాలెం (చైతన్యరథం): పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా నిలుస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెం లోని తన క్యాంపు కార్యాలయంలో 106 మంది లబ్ధిదారులకు రూ.55.08 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డా.స్వామి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, సంతోషంగా ఉండాలని, ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వైద్య సేవలకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. తాజాగా కొండపి నియోజకవర్గ పరిధిలో 106 మందికి 55 లక్షల 8 వేల రూపాయలు చెక్కులను అందించామన్నారు. ఇప్పటి వరకు కొండపి నియోజకవర్గంలో 1167 మంది లబ్ధిదారులకు 9 కోట్ల 4 లక్షల 32 వేల రూపాయల మేర ఆర్థిక సహాయం అందించినట్టు తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. కొండపి నియోజక వర్గానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడం పట్ల ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలోనూ 2014-19 మధ్య కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేశామన్నారు. జగన్‌లా మేం ప్రజలను మోసం చేయం, ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతున్నట్లు మంత్రి తెలిపారు. తల్లికి వందనం కార్యక్రమం కింద ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంత మందికీ ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని అమలు చేస్తున్నామన్నారు. దీపం -2 పథకం కింద సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు రూ.4వేలు, రూ.6 వేలు, రూ.10వేలు, రూ.15 వేల రూపాయల వంతున సంవత్సరానికి రూ.3వేల కోట్ల రూపాయలు అందచేస్తున్నామన్నారు. చంద్రబాబు అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్. పీ 4తో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం. అలాగే ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని మంత్రి డా. స్వామి స్పష్టం చేశారు.

# తిరుపతిలో 600 ఎకరాల్లో ధార్మిక టౌన్‌షిప్

- అనుమతులు, ప్రాజెక్టు పూర్తికి సహకరించండి
- మంత్రి అనగానిని కలిసిన 'డెల్లా' గ్రూపు ప్రతినిధులు

అమరావతి(చైతన్యరథం): ప్రముఖ హైందవ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో 600 ఎకరాల్లో ధార్మిక టౌన్‌షిప్‌ను డెల్లా గ్రూపు సంస్థ నిర్మిస్తోంది. ఐదు వేల సంవత్సరాల హిందూ మత సాంస్కృతిక చరిత్రను ప్రపంచానికి తెలియజేయాలనే లక్ష్యంతో డెల్లా గ్రూపు తిరుపతిలో భారీ స్థాయిలో వసుదైక కుటుంబం పేరుతో అంతర్జాతీయ టౌన్ షిప్‌ను నిర్మిస్తోంది. దీనికి సంబంధిం చి తిరుపతి విమానాశ్రయానికి దగ్గరలో 600 ఎకరాలను ఇప్పటికే ప్రైవేట్ డెవలపర్ కలిగి ఉన్నారు. ప్రైవేట్ భూముల్లో చేపట్టబోయే ఈ ప్రైవేటు ప్రాజెక్టుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిం చాలని డెల్లా ప్రతినిధులు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ను కోరారు. గురువారం అమరావతిలో డెల్లా ప్రతినిధులు



జిమ్మి మిస్త్రీ, దిబ్యేందు బెనర్జీలు మంత్రిని కలిసి ప్రాజెక్టు స్వరూపాన్ని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా తిరుపతి ప్రపంచ స్థాయి టూరిస్ట్ హబ్‌గా మారుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టులో హిందూ యిజంపై ప్రపంచపు మొట్టమొదటి ఎగ్జిబిషన్‌తో పాటు అధ్యాత్మిక, సాంస్కృతిక, అతిథ్యం, మెడికల్ వెల్‌నెస్ సెంటర్లు, అడ్వంచర్ పార్కులు, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, అత్యున్నత రియల్ ఎస్టేట్ అంశాలను మేళవించి టౌన్‌షిప్‌ను నిర్మిస్తామని చెప్పారు. ప్రపంచంలోనే ఎక్కడా లేనటువంటి ఈ ప్రాజెక్టుకు త్వరగా అనుమతిలిచ్చేందుకు, త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం వైపు నుంచి అన్నిరకాలుగా సహాయ, సహకారాలు అందించాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అధ్యాత్మిక పర్యాట క రంగాన్ని కూడా తమ ప్రభుత్వం పోత్సహిస్తోందని, ఇప్పటికే వివిధ దేశాల నుంచి భక్తులు వస్తున్న తిరుపతికి ఇలాంటి ప్రాజె క్టుల ద్వారా మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వ పరంగా నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు త్వరగా ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబుతోనూ మాట్లాడతానని చెప్పారు.

# భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా విద్యుత్ ప్రాజెక్టులు

- ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టులు వేగవంతం
- నిర్ణీతకాల పరిమితిలోగా పూర్తి చేసేలా పనిచేయాలి
- పారిశ్రామిక, గృహ అవసరాలకు సబ్‌స్టేషన్ల నిర్మాణం
- పనులపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలి
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి ఆదేశం



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పెద్దఎత్తున జరుగుతు న్న పారిశ్రామిక అభివృద్ధికి బాసటగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులు వేగవంతం చేయాలని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గురువారం తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయంలో ఏపీ ట్రాన్స్ కో, ఏపీఎస్పీడీసీఎల్ కు చెందిన ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో జరుగుతున్న ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టుల నిర్మాణాలు, పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్త పరిశ్రమల స్థాపన, తయారీ యూనిట్ల విస్తరణ, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో... పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారుల ను ఆదేశించారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న పరిశ్రమలకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా ముఖ్యమైన విద్యుత్‌ను అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తు విద్యుత్ లోడ్‌ను దృష్టిలో ఉంచుకుని, పరిశ్రమలతో పాటు గృహ వినియోగదారులు, వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా విద్యుత్ సంస్థలు ముందుగానే సిద్ధం కావాలని తెలిపారు. భవిష్యత్‌లో విద్యుత్ అవసరాలను సమర్థ వంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభు త్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యు త్ సరఫరాలో ఏ విధమైన ఆటంకాలు లేకుండా ఉండేందుకు 132 కేవీ, 220 కేవీ, 400 కేవీ సామర్థ్యాలతో 29 కొత్త ఉప కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ ఉప కేంద్రాలు గ్రిడ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరాకు కీలకంగా నిలుస్తాయని ఆశాభా వం వ్యక్తం చేశారు. వ్యవసాయ, గృహ వినియోగదారులకు అందించే సేవలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. వ్యవసాయ, గృహ కనెక్షన్లపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని, దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించాలని విద్యుత్ సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని విభాగాల్లో కనీసం 95 శాతం వినియోగదారులు సంతృప్తి సాధించే లక్ష్యం తో పనిచేయాలని సూచించారు. ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టుల పురోగతికి సంబంధించి పనులు వేగవంతం చేయా లని ఆదేశించారు. ఇందుకుగాను సంబంధిత కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుని, అన్ని ఉపకేంద్రాలు, లైన్లు, నెట్‌వర్క్ అప్‌గ్రేడేషన్ పనులు నిర్ణీత గడువులోనే పూర్తయ్యేలా చూడాల న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న శాఖ పరమైన పనులపై ప్రతి 15 రోజులకు ఒకసారి అధికారులతో సమీక్ష ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. అయితే అధికారులు కూడా ఎప్పటికప్పు డు పనుల పురోగతిపై నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో విద్యుత్ శాఖకు సంబంధించిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పరకామణి కేసులో పెద్ద తలలు

- భూమనను అరెస్టు చేసి విచారించాలి
- రవికుమార్ ఆస్తులపై దర్యాప్తు చేయాలి
- శాప్‌చైర్మన్ అనిమిని రవినాయుడు

మంగళగిరి(చైతన్యరథం): పరకామణి కేసులో జగన్‌రెడ్డి నుంచి కింది స్థాయి నాయకుల వరకు చాలామంది ఉన్నట్లు భూమన కరుణాకర్‌రెడ్డి పరోక్షంగా ఒప్పుకున్నారని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు వ్యాఖ్యానించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బుధవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో భూమన విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దొంగ ఏడుపులు ఏడ్చారు..పరకామణి కేసులో దొరికిపోతున్నా మని తెలిసే నాటకాలు ఆడుతున్నారు. శ్రీవారికి భక్తులు ఇచ్చే కానుకలను భూమన కరుణాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి అప్పనంగా పంచుకున్నారని మండిపడ్డారు. పరకామణి కేసు రాజీకి భూమన కరుణాకర్ ప్రమేయం లేదా? అని ప్రశ్నించారు. రవికుమార్, ఆయన బంధువుల ఆస్తులు వైసీపీ నాయకులు



కొట్టేయలేదా అని ప్రశ్నించారు. చంద్రగిరి మండలం దోర్నకల్‌లో 8 ఎకరాలు ఎవరి పేరు మీద రాయించారో చెప్పాలన్నారు. రవికుమార్ బినామీ జయచంద్రను సీఐడీ అధి కారులు విచారించాలన్నారు. తమిళ నాడు పాండి బజార్‌లో నిందితుల మధ్య మధ్యవర్తిత్వం జరిగింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. పరకామణి కేసులో రవికుమార్‌తో పాటు అనేక మంది నిందితులు ఉన్నారు. టీటీడీ ఒక ట్రస్టీ.. బోర్డు సభ్యులే తప్పు చేస్తే భక్తులు ఎవరికి చెప్పుకోవాలి. వడ్డికాసుల వాడు వెంకటేశ్వర స్వామితో ఎవరూ పెట్టుకున్న చరిత్ర హీనులుగా మిగిలిపోతారని ధ్వజమెత్తారు.

### భూమనను అరెస్టు చేయాలి

పరకామణి కేసులో భూమన కరుణాకర్‌రెడ్డిని అరెస్టు చేసి విచారించాలని కోరారు. స్వామి వారి దర్శన టికెట్లు అమ్మిన వ్యక్తు లను అరెస్టు చేస్తున్నాం. కోట్లు దోచేసిన వారిని అరెస్టు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. భూమన కరుణాకర్, సుబ్బారెడ్డి చైర్మన్‌లుగా చేసి టీటీడీని భ్రష్టుపట్టించారు. పరకామణి కేసు నిందితుడు రవికుమార్ మీద భూమన ఎందుకు అంత ప్రేమ చూపిస్తున్నారో అర్థం కావడం లేదు. రవికుమార్ బంధువుల ఆస్తు లు ఎవరి పేరు మీద ట్రాన్స్‌ఫర్ అయ్యాయో సీఐడీ అధికారులు విచారించాలని కోరారు.

### సతీష్‌కుమార్ కేసును వేగంగా విచారించాలి

పరకామణి కేసులో ఫిర్యాదుదారుడు సతీష్‌కుమార్ మరణాన్ని భూమన ఆత్మహత్యగా ఎలా చిత్రీకరిస్తారని మండిపడ్డారు. హత్య చేశారని వాళ్ల కుటుంబ సభ్యులే చెబుతున్నారు. పరకామణి కేసు తో పాటు సతీష్ కుమార్ హత్య కేసును పోలీసులు వేగంగా విచారించాలని కోరారు. ఈ కేసులో భూమన కరుణాకర్‌రెడ్డిని అరెస్టు చేస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు. సతీష్‌కుమార్ మీద భూమన ఒత్తిడి చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గతంలో శ్రీవారి పింక్ డైమండ్, వైస్ వివేకా హత్య కేసులో వైసీపీ నాయకులు కుట్రలు చేసి నిందలు టీడీపీపై వేసింది. పరకామణి కేసులోనూ రవికుమార్ ప్రాణానికి హాని ఉందని, ఆయనకు రక్షణ కల్పించాలని కోరారు.

# ఏపీలో క్యాన్సర్ రిజిస్ట్రీ, ట్యూమర్ బోర్డు

**ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సూచన**

**పరికరాల కొనుగోలుకు నిధిలిస్తామని వెల్లడి**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో క్యాన్సర్ నియంత్రణ, నివారణ దిశగా జరుగుతున్న కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం గురువారం పలు సహాయక చర్యలను ప్రకటించింది. ఢిల్లీలో నేడు జరిగిన ఎన్సీడీ, క్యాన్సర్ కేర్ వర్క్‌షాపులో చర్చల సందర్భంగా ఈ నిర్ణయాలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటించి నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఒక ప్రకట నలో తెలిపారు. క్యాన్సర్ మందుల కొనుగోలులో ఆర్థిక తోడ్పాటు తో పాటు క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరికరాల కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం 80 శాతం మేరకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీ ఎఫ్) అందిస్తామని కేంద్రం ప్రకటించినట్లు సౌరభ్ గౌర్ వెల్లడించారు. క్యాన్సర్ వ్యాధి నియంత్రణ, నివారణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల ద్వారా సత్ఫలితాలు సాధిం చేందుకు రాష్ట్రంలో క్యాన్సర్ రిజిస్ట్రీ, ట్యూమర్ బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించిందని, ఈ విషయంలో కూడా కేంద్ర సహాయం అందే అవకాశాలు ఉన్నాయని వివరించారు.

### ఇతర ప్రోత్సాహకాలు

పీపీపీ విధానంలో మందుల నిల్వకు గోదాముల నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం సహాయం అందించడంతో పాటు అన్ని సెకండరీ ఆసుపత్రుల్లో(సీహెచ్‌సీలు, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులు) అమ్రిత్ (AMRIT-Affordable Medicines and Reliable Implants) పథకం కింద 50 శాతం రాయితీతో కేంద్ర ఆరోగ్య శాఖ మందులు, కృత్రిమ అమరికలు(ఇంప్లాంట్స్) అందిస్తుందని సౌరభ్‌గౌర్ వెల్లడించారు.

# రబీలో యూరియా సమస్య తలెత్తకూడదు

- సరఫరాపై జేసీలు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- రాష్ట్ర వ్యాప్తంగా నిల్వలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి
- ఆగ్రోస్ సంస్థ అవినీతిపై విజిలెన్స్ దర్యాప్తు
- వ్యవసాయ, అనుబంధ శాఖల సమీక్షలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): రబీ సీజన్‌లో రాష్ట్రంలో రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ యూరియా కొరత తలెత్తకూడదని అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. గురువారం విజయవాడ క్యాంప్ ఆఫీస్‌లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రబీకి అవసరమైన యూరియా నిల్వలు సమృద్ధిగా ఉండేలా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసరమైతే బఫర్ స్టాక్స్‌ని ఉపయోగించుకోవాలని, అన్ని ఆర్ఎస్‌కే ల్లో అన్ని రకాల ఎరువులు అవసరమున్న రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. కాగా రబీ సీజన్‌కు మొత్తం 20.69 లక్షల టన్నుల ఎరువుల అవసరం ఉండగా, ఇప్పటివరకు 2.38 లక్షల టన్నులు రాష్ట్రానికి చేరుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 26వ తేదీ నాటికి 9.38 లక్షల టన్నుల యూరియా అవసరం ఉండగా, అందుబాటులో 4.01 లక్షల టన్నుల నిల్వలు ఉన్నాయని, అదే సమయంలో 2.10 లక్షల టన్నుల యూరియా రైతులకు అందజేశామని, ఇంకా 1.91 లక్షల టన్నుల యూరియా నిల్వగా ఉందని మంత్రికి అధికారులు వివరించారు. ముఖ్యంగా అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు, కర్నూలు, కడప, తదితర జిల్లాల్లో అవసరానికి అనుగుణంగా సరఫరా.. నిల్వలు ఉంటున్నాయి. అదనంగా 9,432 మెట్రిక్ టన్నుల యూరియా రవాణా దశలో ఉంది. జిల్లాల వారీగా అవసరం, అందుబాటు, పంపిణీ వివరాలు కూడా సమగ్రంగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా పోర్టుల్లో 1.35 లక్షల టన్నుల యూరియా స్టాక్‌గా ఉంది. అవసరాన్ని బట్టి ఈ స్టాక్‌ను జిల్లాలకు తరలిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడకుండా ముందుగానే ప్రణాళికాబద్ధంగా ఎరువుల సమీకరణ, పంపిణీ జరుగుతోందని, రానున్న రోజుల్లో రవాణాలో మరింత మొత్తంలో చేరనుందని, ఎరువుల కొరత ఏ జిల్లాలోనూ తలెత్తకుండా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు.

**జిల్లాల వారీగా పక్కాగా నిల్వల లెక్కలు**

అధికారుల వివరణపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ గ్రోమోర్ షాపుల వద్ద తరచుగా యూరియా సరఫరా సమయంలో ఇబ్బందులు వస్తున్నాయని, వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. జిల్లాల వారీగా నిల్వల లెక్కలు పక్కాగా ఉండాలని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలను వ్యత్యాసాలు లేకుండా అందచేయాలన్నారు. జేసీలు ప్రత్యేక శ్రద్ధ చూపి రైతులకు యూరియా సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ రవాణా, దందాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని, ఎరువుల సరఫరాలో ఏ చిన్న అంతరాయం వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు వ్యవస్థలను సిద్ధంగా ఉంచాలన్నారు. ట్రేడర్స్ సకాలంలో విత్తనాలను రైతులకు అందచేయటం లేదని, అలాంటి వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలను తీసుకోవాలన్నారు.

**ఆగ్రోస్‌పై విజిలెన్స్ దర్యాప్తు**

ఇటీవల ఆగ్రోస్ సంస్థలో వస్తున్న వరుస అవినీతి కథనాలపై స్పందించిన మంత్రి వెంటనే కార్యకలాపాలపై విజిలెన్స్ ద్వారా దర్యాప్తు చేయించాలని ఆదేశించారు. ఆగ్రోస్ ద్వారా రైతులకు సబ్సిడీపై అందచేసే వాహనాలలో మార్పు లేకుండా సరఫరా చేయాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రోన్ పరికరాలను సద్వినియోగం చేసుకునే విధంగా రైతులకు పూర్తి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తుఫాన్లను తట్టుకునే విధంగా, మంచి దిగుబడిని అందచేసే వరి వంగడాలను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కూరగాయల ధరలు పెరగకుండా దృష్టి సారించాలని, వినియోగదారులకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. పొగాకు రైతులకు డబ్బులు వచ్చాయని రైతులు ఆనందంగా తనకు ఫోన్ చేసి చెప్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ, జేడీలు కృపాదాస్, బాలు నాయక్, ఎస్ఈ హరిబాబు చౌదరి, ఆగ్రోస్ మేనేజర్ కూర్మారావు, ఏపీ సీడ్స్ మేనేజర్ జలందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో..
# వచ్చే నెల 14 నుంచి ఉచిత సివిల్స్ కోచింగ్

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి
- 100 మందికి ఉచిత శిక్షణతో పాటు వసతి
- వచ్చే నెల 3 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- 7న అర్హత పరీక్ష నిర్వహణ, 11న ఫలితాలు వెల్లడి
- గతేడాది శిక్షణ పొందిన వారూ అర్హులే



విజయవాడ (చైతన్యరథం): బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్న లక్ష్యంతో, బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నవంబర్ 14వ తేదీ నుంచి ఉచిత సివిల్స్ ఇంటిగ్రేటెడ్ కోచింగ్ అందజేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉచిత సివిల్ సర్వీసెస్ ఇంటిగ్రేటెడ్ కోచింగ్ కోసం తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, బీసీ బిడ్డలను ఉన్నత స్థానాల్లో నిలవాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రెండో విడత సివిల్ సర్వీసెస్ కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వంద మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేలా గొల్లపూడి బీసీ భవన్‌లో ఏర్పాట్లు చేయిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి నవంబర్ మూడో తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నామని, ఏడో తేదీన అర్హత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. 11వ తేదీన అర్హత పరీక్ష ఉత్తీర్ణత ఫలితాలు ప్రకటించి, 14వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు12వ తేదీన గొల్లపూడిలోని బీసీ భవన్‌లో రిపోర్టు చేయాలని తెలిపారు. తెలుపు రంగు రేషన్ కార్డు కలిగిన బీసీ అభ్యర్థులు ఉచిత సివిల్స్ శిక్షణకు అర్హులన్నారు. గతేడాది ఉచిత శిక్షణ పొందిన వారు కూడా మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఉచిత సివిల్స్ ఇంటిగ్రేటెడ్ కోచింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నామన్నారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

**ఎస్సీ, ఎస్టీలకూ అవకాశం**

బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందించే ఉచిత సివిల్ సర్వీసెస్ ఇంటిగ్రేటెడ్ శిక్షణకు బీసీ అభ్యర్థులతో పాటు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకూ అవకాశమిస్తున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. 100 సీట్లలో బీసీలకు 66 సీట్లు, ఎస్సీలకు 20, ఎస్టీలకు 14 సీట్లు కేటాయిస్తున్నామన్నారు. మహిళలకు 34 శాతం రిజర్వేషన్లు అమలుచేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, అడిషనల్ డైరెక్టర్ రామచంద్రరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఈహెచ్ఎస్ ప్రక్షాళనకు ఏడుగురితో కమిటీ

- ముఖ్యమంత్రి హామీ మేరకు నిర్ణయం
- ఉద్యోగుల ఆరోగ్య పథకానికి పరిష్కార మార్గాలు
- ఎనిమిది వారాల్లో నివేదిక సమర్పించాలి
- వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, వారి కుటుంబసభ్యుల ప్రయోజనం కోసం అమలవుతున్న ఎంప్లాయీస్ హెల్త్ స్కీం(ఈహెచ్ఎస్) నిర్వహణలో ఎదురవు తున్న సమస్యలు, లోపాలను గుర్తించి తగు పరిష్కార మార్గాలను సూచించడానికి ప్రభుత్వం ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ విషయంపై గత నెలలో ఉద్యోగ సంఘాలకు, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం కమిటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వం వహించే ఈ కమిటీలో జీఏడీ విభాగం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శి, వ్యయ విభాగం కార్యదర్శి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, ఉద్యోగ సంఘాల ఇద్దరు ప్రతినిధులు ఉంటారు. ఈ కమిటీ ఎనిమిది వారాల్లో ఈహెచ్ఎస్ పటిష్ట అమ లుపై నివేదిక సమర్పించాల్సి ఉంటుం ది. 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంభమైన ఈహెచ్ఎస్ పథకంలో మొత్తం 23,58,858 లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 5,53,182మంది ఉద్యోగులు, 2,29,964 మంది పింఛనుదారులు, 81,748 మంది కుటుంబ పింఛనుదారులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ పథకంపై అయ్యే ఖర్చులో ప్రభుత్వం, లబ్ధిదారులు చెరి సగం భరిస్తారు. సాలీనా దాదాపు రూ.350కోట్ల మేర ఖర్చవుతోంది.

**గత నెలలో ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన అంశాలు**

వైద్యసేవల కోసం చేసిన ఖర్చును సకాలంలో చెల్లించక పోవ డం, వివిధ వ్యాధుల ప్యాకేజీ ధరలను పెంచకపోవడం, ఈహెచ్ ఎస్ కింద సేవలందించడానికి ఆసుపత్రుల నిరాసక్తత, పర్యవేక్షణ లోపం, ఫిర్యాదుల పరిష్కారం జరగకపోవడం, ఈహెచ్ఎస్ అమ లు కోసం వినియోగిస్తున్న ఆన్‌లైన్ పోర్టల్ పరిమిత సామర్థ్యం మొదలైనవి. ఈహెచ్ఎస్ పథకం అమలులో లబ్ధిదారుల అనుభ వాలు, సమస్యలు, లోపాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి పరిష్కార మార్గాలపై ఎనిమిది వారాల్లో నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు.

# త్వరితగతిన బనగానపల్లె బై పాస్

- అధికారులతో సమీక్షలో మంత్రి జనార్దన్ రెడ్డి



అమరావతి (చైతన్యరథం): నంద్యాల జిల్లా బనగానిపల్లె బై పాస్ రహదారి పనులు త్వరితగతిన చేపట్టాలని అధికారులను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. సచివాలయం లోని ఆర్ అండ్ బీ మంత్రి కార్యాలయంలో బనగానపల్లె బైపాస్ నిర్మాణంపై శాఖ ఉన్నతాధికారులతో గురువారం మంత్రి జనార్దన్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. బనగానపల్లె బైపాస్ నిర్మాణం త్వరితగతిన చేపట్టి, నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. బైపాస్ నిర్మాణంతో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరి హారం కింద ఇప్పటికే 2 విడతలుగా దాదాపు రూ. 5 కోట్లు చెల్లింపులు పూర్తి చేసిన క్రమంలో పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి బనగానపల్లె బైపాస్ పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు చొరవ తీసుకుని పనిచేయాలన్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రజలకు మెరుగైన రహదారుల కల్పనకు.. గుంతల రహితంగా రోడ్లను తీర్చిదిద్దాలని సూచించారు. అదే సమయంలో ఇప్పటికే జిల్లాలో చేపట్టిన రహదారుల అభివృద్ధి పనులను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ శాఖ ఈఎన్‌సీ వివేకానందరెడ్డి, కర్నూలు ఎస్ఈ మహేశ్వరరెడ్డి, నంద్యాల ఈఈ శ్రీధర్ రెడ్డి, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

- ఇప్పటికి 8,22,000 మెట్రిక్ టన్నుల కొనుగోలు
- రైతుల ఖాతాల్లో రూ.1,713 కోట్లు జమ
- కొనుగోలు చేసిన 4-6 గంటల్లోనే నగదు చెల్లింపులు
- అసత్య ప్రచారాలను రైతులు నమ్మొద్దు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విజయవాడ (చైతన్యరథం): రైతులు దళారులను నమ్మకుండా రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు ధాన్యం అమ్మకాలు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు సూచించారు. విజయవాడ శివారులోని కానూరు సివిల్ సప్లైస్ భవన్‌లో గురువారం ధాన్యం కొనుగోళ్లపై ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రైతులు రూపాయి నష్టం పోకుండా కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, 4 నుంచి 6 గంటల వ్యవధిలో రైతుల ఖాతాల్లో నగదు జమ వేస్తున్నామన్నారు. కొద్దిమంది నేతలు అన్యాయంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, రైతులు అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గత ప్రభుత్వం రైతులకు రూ. 1,674 కోట్ల బకాయిలు పెట్టి వెళితే కూటమి ప్రభుత్వం వచ్చాక చెల్లించిందన్నారు. కృష్ణా జిల్లాలో లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం నేడు ఒక రికార్డు అన్నారు. గోదావరి జిల్లాల నుంచి లక్ష టన్నుల పైనే ధాన్యం సేకరించామని, క్షేత్రస్థాయిలో అధికారులు రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నారని వారి మనోధైర్యం దెబ్బ తీసేలా కొద్దిమంది నేతలు నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం 2022-23లో 3,33,155 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ. 679.79 కోట్లు రైతుల ఖాతాల్లో వేస్తే కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు 8,22,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.1,713 కోట్లు జమ చేసిందన్నారు.

### ముందుగానే సేకరణ

గత ప్రభుత్వంలో ఇదే రోజున ట్రాన్స్ పోర్టు శాఖలో 394 లారీలను నమోదు చేసుకున్నారన్నారు. 2023-24 లో 455 లారీలు మాత్రమే నమోదు చేసుకున్నారన్నారు. అదే కూటమి ప్రభుత్వంలో ఇప్పటికి 2,715 లారీలను ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ శాఖలో నమోదు చేసుకున్నారన్నారు. ఖరీఫ్, రబీలో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లో ట్రాన్స్‌పోర్టు వాహనాల బకాయిలను రూ. 9 కోట్లు చెల్లించామన్నారు. 7 కోట్ల 53 లక్షల గోనె సంచులను రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేయగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో వీటికి



అదనంగా లక్ష గోనె సంచులను రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం చేసి రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రక్రియ మొత్తం మూడు నెలల్లో జరగాల్సి ఉండగా.. వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతుల ఆందోళనను గుర్తించి ముందే ధాన్యం సేకరిస్తున్నామన్నారు. ప్రభుత్వం చాలా వేగంగా స్పందించి చర్యలు తీసుకుంటున్న విషయం రైతులు కూడా అర్థం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చే సూచనలు, ప్రోత్సాహం వల్లే కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దళారులు రైతులను మాయ మాటలతో మోసం చేసేలా వ్యవహరిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ. 1792 రూపాయలు మద్దతు ధర చెల్లిస్తుందని మంత్రి నాదెండ్ల తెలిపారు.

### తక్కువ ధరకు అమ్ముకోవద్దు

వాతావరణ శాఖ సూచనల ప్రకారం రాష్ట్రంలో 30 వ తేదీ వరకు వర్షాలు లేవన్నారు. ఆ తర్వాత ఐదు జిల్లాల్లో వర్ష సూచనలు ఉన్నాయి. కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఒకటో తేదీ నుంచి ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, దళారులు చేసే మోసాలు నమ్మవద్దన్నారు. ధాన్యం తరలింపునకు 24 వేల ట్రక్కులు జీపీఎస్‌తో సిద్ధంగా ఉన్నాయన్నారు. వర్షాల నుంచి కౌలు రైతులను ఆదుకునేందుకు టార్పాలిన్ పట్టాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచామన్నారు. దళారీల అబద్ధాలు నమ్మి రైతులు తక్కువ రేటుకు ధాన్యం అమ్ముకో వద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. క్యాబినెట్ సమావేశం తర్వాత కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మరోసారి పర్యటించి రైతులకు భరోసా కల్పిస్తామన్నారు. ఈ- క్రాప్‌లో నమోదయిన పొలంలో వచ్చే దిగుబడిని పూర్తిగా కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఫైన్ క్వాలిటీ రైస్‌కు ప్రాధాన్యత ఇచ్చి.. మధ్యాహ్న భోజన పథకానికి వాడుతున్నామని, ఆ పంట ఎక్కడ ఉన్నా.. ప్రతి బస్తా కొనుగోలు చేయాలని అధికారులకు చెప్పామన్నారు. రాజకీయంగా అసత్యాలు ప్రచారం చేస్తున్న వారికి రైతులే సమాధానం చెప్పాలన్నారు.

## రాజధాని రైతుల సమస్యలపై కమిటీ సమావేశం

- జరీబు, మెట్ట, అసైన్డ్, లంక భూములపై చర్చ
- పాల్గొన్న పెమ్మసాని చంద్రశేఖర్, నారాయణ



అమరావతి (చైతన్యరథం): రాజధాని రైతుల సమస్యల పరి ష్కా రంపై మరోసారి కమిటీ గురువారం సమావేశమైంది. సమావే శానికి హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు. జరీబు - మెట్ట భూముల అంశం, గ్రామ కంఠాలు, అసైన్డ్, లంక భూముల రైతుల సమస్యల పరిష్కారంపై చర్చించా రు. వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారంపై కమిటీ దృష్టిసారిం చింది. రైతుల ప్లాట్లకు హద్దు రాళ్లు వేసి వెంటనే అభివృద్ధి పను లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గుంటూరు, మంగళగిరి నుంచి అమరావతికి వచ్చే రోడ్ల అభివృద్ధిపైనా చర్చిం చారు. శనివారం ఉదయం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

## ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా ఫారూక్ శుబ్లీ

### మంత్రి ఫరూక్ సమక్షంలో బాధ్యతల స్వీకరణ

అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా విజయవాడకు చెందిన ఫారూక్ శుబ్లీని నియమిస్తూ మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సి. హెచ్.శ్రీధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు వెలువడిన వెంటనే రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సమ క్షంలో ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా శుబ్లీ బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని మూడవ బ్లాక్‌లో మైనారిటీ శాఖ పేషి కార్యాల యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ ద్వారా ఉర్దూ భాషాభివృద్ధి, ఉర్దూ ఘర్-షాదీ ఖానాలు, శిక్షణ కేంద్రాల సమర్ధ నిర్వహణ కోసం క్షేత్రస్థాయిల, ప్రణాళికాబద్ధంగా కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మైనారిటీ సంక్షేమ మంత్రి ఫరూక్‌ల సలహాలు, సూచనలతో ఉర్దూ



అకాడమీ పేరు ప్రతిష్టలను చైర్మన్‌గా మరింత ముందుకు తీసుకెళతానని ఫారూక్ శుబ్లీ పేర్కొన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన సీఎం, డిప్యూటీ సీఎం, విద్యామంత్రి, మైనారిటీ మంత్రి, పార్టీ అధిష్టానానికి ఫారూక్ శుబ్లీ కృతజ్ఞతలు తెలిపారు.

# వర్షాలతో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్లు ముందుజాగ్రత్తలు తీసుకోవాలి
- ఫిర్యాదులు వస్తే జేసీలే బాధ్యత వహించాలి
- ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశం

అమరావతి (చైతన్యరథం): బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో రానున్న నాలుగురోజుల్లో దక్షిణ ఆంధ్రప్ర దేశ్ జిల్లాలు సహా కోస్తా జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నం దున కలెక్టర్లు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్షి యల్ పాఠశాలలు, ఆర్టీజీఎస్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, డాక్యు మెంట్ అప్లోడ్ ఫర్ ఏజెంట్ స్పేస్ అంశాలపై గురువారం సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించా రు. ముందుగా ఈ సీజన్‌లో ఇప్పటివరకు సేకరించిన ధాన్యం సేకరణపై సమీక్షించారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో రానున్న నాలుగురోజుల్లో దక్షిణ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, సత్యసా యి, వైయస్సార్ కడప జిల్లాలు సహా మిగతా కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం తుఫాను సమచారారాన్ని ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలియజేయాలని ఆర్టీజీఎస్ అధికారులను ఆదేశించారు. ధాన్యం తడిసి పోయి మాయిశ్చర్ శాతం పెరిగిందనే ఫిర్యాదు రాకూడదని స్పష్టం చేశారు. ఈ కారణంతో రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని బయట విక్రయించినట్టు ఫిర్యాదులు వస్తే సంబంధిత జాయింట్ కలెక్టర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ధాన్యం కొను గోలుకు ప్రతిపాదించిన కేంద్రాలు వెంటనే ప్రారంభించాలన్నారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు కొరత లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలపై సమీక్షిస్తూ తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం పరిస్థితులు పూర్తిగా మెరుగుపడాలని సంక్షేమ శాఖల అధికారులను ఆదేశిం చారు.

స్వచ్ఛభారత్ మిషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఆర్టీజీఎస్‌తో వసతిగృహాలను అనుసంధానించి ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని సూచించారు. సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్సియల్ పాఠశాల నిర్వహణ మెరుగుపర్చేందుకు సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆదేశిం చారు. వర్చువల్‌గా పాల్గొన్న వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో 17 లక్షల హెక్టార్లలో వరి సాగవగా 113 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా అని చెప్పారు. సీఎం కార్యదర్శి ఎ.వి.రాజమౌళి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి కొన్ని అంశాలు ముఖ్యమంత్రి దృష్టికి వచ్చాయని మిల్లర్లు సిండికేట్ కాకుండా చూడాలని చెప్పారు. ధాన్యం రవాణాకు తగిన విధంగా ట్రాన్స్‌పోర్టు టైఅప్ చేయాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. పౌరస రఫరాల సంస్థ వీసీ అండ్ ఎండీ ఢిల్లీరావు మాట్లాడుతూ ఈ సీజన్లో ఇప్పటివరకు లక్షా 16 వేల మంది రైతుల నుంచి రూ.1877 కోట్ల విలువైన 7.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.1720 కోట్ల రూపాయలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని వివరించారు. గోనె సంచులు, టార్పాలిన్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో సాంఘిక, గిరిజ న సంక్షేమ శాఖల కార్యదర్శి ఎం.ఎం.నాయక్, ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ కెఎస్ విశ్వనా థన్, ప్రణాళికా శాఖ జెఎస్ అనంతశంకర్, సివిల్ సప్లయీస్ డైరెక్టర్ గోవిందరావు పాల్గొన్నారు.

# క్యాన్సర్ చికిత్సకు లీనాక్ పరికరం

- అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయండి
- వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం
- విజయవాడ జీజీహెచ్ సమస్యలపై సమీక్ష

విజయవాడ (చైతన్యరథం): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో క్యాన్సర్ వైద్యసేవలు మరింత మెరుగుపరిచే చర్య ల్లో భాగంగా 'లీనాక్ ' (లీనియర్ యాక్సిలరేటర్) పరికరాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయా రుచేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గా ఉన్న సత్యకుమార్ విజయవాడ కలెక్టరేట్ కార్యాలయంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, నగర ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహనరావులతో గురువారం ప్రత్యేకంగా సమావేశమై జీజీహెచ్ అభివృద్ధి గురించి చర్చించా రు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ క్యాన్సర్ వైద్య సేవల్లో ముఖ్యమైన లినాక్ పరికరాన్ని విజయవాడ జీజీహెచ్‌లో అందుబా టులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించి, ఉన్నత వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు కూట మి ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. విజయవాడ జీజీహెచ్లో 'లీనాక్ ' ఏర్పాటుకు అవసరమైన స్థలం గుర్తింపు, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి (సామాజిక బాధ్యత) ఆర్థిక సహకారం అందే దుకు ఉన్న మార్గాలను పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని డైరె క్టరేటు ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులను ఆదేశించారు. క్యాన్సర్ కణాలను నాశనం చేసేందుకు ఉప



యోగించే ఈ పరికరం ఏర్పాటుకు ప్రత్యేకంగా బంకర్‌ను ఆసుపత్రిలో ఏర్పాటుచేయాల్సి ఉందని అధికారులు చెప్పగా నిపుణులను రప్పించి అనువైన ప్రదేశం గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి స్పష్టంచేశారు. ఈ పరికరం సమకూ ర్చేందుకు సుమారు రూ.20 కోట్ల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు.

**నర్సింగ్ విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి హామీ**

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేసిన విజ్ఞప్తిపై మంత్రి స్పందిస్తూ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు హాస్టల్ విషయంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఔషధ నియంత్రణ శాఖ భవనాన్ని తాత్కాలికంగా ఉపయోగించుకు నేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని చెప్పారు. దీనిపై త్వరలోనే సానుకూలంగా ప్రభుత్వం నిర్ణయాన్ని తీసుకుంటుం దని హామీ ఇచ్చారు. పాత ప్రభుత్వాసుపత్రిలో మాతా, శిశువైద్య సేవల విస్తరణలో భాగంగా నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విజయవాడ జీజీహెచ్లో సేవలు పొందే వారి సంఖ్య భారీగా పెరిగిందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. వీరి అవసరాలకు తగ్గట్లు కొత్త, పాతాసుపత్రుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సుమారు రూ.80 కోట్ల వరకు అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ పీజీ వైద్య సీట్ల పెంపునకు తగ్గట్లు కేంద్రం నుంచి వచ్చిన నిధుల వినియోగం ఎలా జరిగింది? విజయవాడ జీజీహెచ్‌లో ఏయే పనులు చేపట్టారో నివేదించాలని డీఎంఈను ఆదేశించారు. ఇదేవిధంగా రాష్ట్రంలోని ఇతర ఆసుపత్రుల్లో చేపట్టిన నిర్మాణాల వివరాలను కూడా తెలియచేయాలని మంత్రి వారికి స్పష్టంచేశారు. ప్రాధాన్యతాక్రమంలో రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో త్వరలో పూర్తయ్యే క్రిటికల్ కేర్ భవనాలను కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో ప్రారంభింపచేసేందుకు చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంఈ డాక్టర్ రఘునందన్, అదనపు డీఎంఈ డాక్టర్ వెంకటేశ్, విజయవాడ జీజీహెచ్ ఇంచార్జి సూపరింటెండెంటు డాక్టర్ శ్యాం, ఆంకాలజిస్ట్ విభాగ అధిపతి డాక్టర్ నెహ్రూ, రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఏపిఎంఎస్ఐడిసి) ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. మరోవైపు జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నాయని, వాటి గురించి చర్చించేందుకు ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటుచేయాలని ప్రజాప్రతిని ధులు కోరగా మంత్రి శ్రీ సత్యకుమార్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే విడిగా ప్రజాప్రతినిధులతో సమాశమవుతానని చెప్పారు.

# కార్మిక సంక్షేమంలో ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్

- కేంద్ర నూతన లేబర్ కోడ్‌ల అమలుకు చర్యలు
- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

విజయవాడ (చైతన్యరథం): నగరంలోని హొటల్ హయత్‌లో గురువారం కొత్త లేబర్ కోడ్స్ అవగాహన కల్పించేందుకు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కార్మిక శాఖ లేబర్ కమిషనర్, సెక్రటరీ శేషగిరిబాబుతో కలిసి మీడియా సమావేశం నిర్వహిం చారు. రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమం, పరిశ్రమలు-ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, కేంద్ర లేబర్ కోడ్స్ అమలుపై కీలక విషయా లను వెల్లడించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, కేంద్రం తీసుకువచ్చిన సామాజిక భద్రత కోడ్ 2020, పారి శ్రామిక వివాదాల కోడ్, వేతనాల కోడ్, ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ అమలులో ముందంజలో ఉందన్నారు. అసంఘటిత రంగం, గిగ్-ప్లాట్‌ఫామ్ వర్కర్లను సామాజిక భద్రత కిందకు తీసుకురావడం ద్వారా లక్షలాది



కార్మికులకు రక్షణ లభిస్తుందని చెప్పారు. ప్రతి కార్మికుడికి సమాన వేతనం, సకా లంలో వేతనం, సురక్షితమైన పని వాతావరణం కల్పించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగుల కోసం మాతృత్వ సెల వులు, వర్క్ ఫ్రం హోమ్ సౌకర్యాలు, రాత్రిపూట పని అనుమ తులు వంటి సంస్కరణలు మహిళల సాధికారతకు ఉపయో గపడు తున్నాయని చెప్పారు. పరిశ్రమలతో సమన్వయం పెంచి, ఉద్యోగా వకాశాలు, పెట్టుబడులు పెరిగేలా అడుగులు వేస్తున్నామని తెలిపారు. లేబర్ కమిషనర్, సెక్రటరీ శేషగిరిబాబు మాట్లాడుతూ కార్మికుల కోసం రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సోషల్ సెక్యూరిటీ ఫ్రేమ్ వర్క్ అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి సంస్థలో హెల్త్ చెకప్ లు, సేఫ్టీ కమిటీలు, అపాయింట్‌మెంట్ లెటర్లు తప్పనిసరి చేస్తు న్నామని తెలిపారు. వలస కార్మికుల కోసం జర్నీ అలవెన్స్, పిడిఎస్ పోర్టబిలిటీ, నిర్మాణ కార్మికుల ప్రయోజనాల పోర్టబిలిటీ అమలులో ఉన్నాయని చెప్పారు. డిజిటల్ మీడియా వర్కర్లు, డబ్బింగ్ ఆర్టిస్టులు కూడా ఈ కొత్త కోడ్ల కింద రక్షణ పొందుతు న్నారని వివరించారు. ఉద్యోగాల తొలగింపులో రీ-స్కిల్లింగ్ ఫండ్ ద్వారా కార్మికులకు తక్షణ సహాయం అందించే విధానం అమల్లో ఉందన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ అడిషనల్ సెక్రటరీ గంధం చంద్రుడు, జేసీఎల్ లక్ష్మీనారాయణ, ఆశారాణి, ఫ్యాక్టరీస్ డైరెక్టర్ మోహన్‌రావు, కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ భూమిని కబ్జా చేశారు

- వైసీపీ నేతల నిర్వాకంపై బాధితుడి ఫిర్యాదు
- ముంపు భూమి పరిహారానికి లంచం డిమాండ్
- ధర్మాజీగూడెంలో కబ్జా..పురుగుమందుతో బెదిరింపులు
- ప్రజావినతుల్లో అర్జీలు స్వీకరించిన మంత్రి జనార్దన్‌రెడ్డి

మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురు వారం ప్రజావినతుల కార్యక్రమంలో ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఏపీ కళింగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ చైర్మన్ రోనంకి కృష్ణంనాయుడు అర్జీలు స్వీకరించారు. అనంతపురం జిల్లా గార్లెదిన్నెకు చెందిన షేక్షావలి సమస్యను వివరిస్తూ గ్రామంలో తమకు వ్యవసాయ భూమి ఉంది. దీనిని చిదంబరప్ప, వెంకటేశు, ఉజ్జినప్ప, భూషణం, ఆదినారాయణ అనే వైసీపీ నాయకులు కబ్జా చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్ప టికీ తమకు న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

**పరిహారం మంజూరుకు లంచం డిమాండ్**

సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం చిన్నచిగుళ్లరేవు గ్రామానికి చెందిన కుళ్ళాయప్ప గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం.239-2లో 6.18 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద ముంపునకు గురికావడంతో సదరు భూమికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ గతంలో అనేకమార్లు అధికారులకు అర్జీలు సమర్పించాను. ధర్మవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాల యంలో పనిచేస్తున్న శంకర్ అనే వ్యక్తి పరిహారం బిల్లు రాసిచ్చేం దుకు తమను రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేశారు. వారిపై



చర్యలు తీసుకుని నష్టపరిహారం ఇప్పించాలని కోరాడు.

**భూమిని కబ్జా చేసి బెదిరిస్తున్నారు**

ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంకు చెందిన సాయిబాబు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం సుమారు 293/1, 194/2లో మొత్తం య.2.34 సెంట్ల భూమి ఉంది. తమ భూమిని కదగించి నాగలక్ష్మి, సతీష్, వెంకటరావు కబ్జా చేశారు. భూమిని సాగుచేసుకుంటున్న రైతు, కౌలుదారులపై దాడి చేసి విత్తనాలను పాడుచేశారు. ఆ తర్వాత నాగలక్ష్మి, సతీష్‌లు పురుగు మందులు తాగుతామని ఆర్డీవో, ఎస్ఐను బెదిరించారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలి**

కర్నూలు జిల్లా కల్లూరుకు చెందిన మహేంద్ర సమస్యను వివరిస్తూ సర్వే నెం. 354, విస్తీర్ణం 4.62 ఎకరాలు ఉంది. వక్ఫ్ బోర్డ్ భూమిగా నిషేధిత జాబితాలో చేర్చారు. తమ భూమి తరహా లోనే ఉన్న సర్వే నెం.618ను మాత్రం పలుకుబడి ఉన్న వారికి రైత్వారీ పట్టాగా మార్చారు. తమ విషయంలో మాత్రం రెవెన్యూ రికార్డుల్లో ద్వంద్వ విధానాలు పాటిస్తున్నారు. ఈ సమస్య పరిష్కా రానికి లంచం డిమాండ్ చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్క రించాలని కోరాడు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం పాలకుర్తి గ్రామానికి చెందిన కుల్లాయమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం. 188,189-1లో య.1.18 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని రిజిస్టర్ చేసేందుకు అర్జీ పెడితే తమ పొలం 22-ఎ నిషేధ జాబితాలో ఉన్నందున రిజిస్ట్రేషన్ చేయడం కుదర దని చెప్పారు. తమ భూమిని నిషేధిత జాబితాలో నుంచి తొలగిం చి ఆన్‌లైన్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఫోర్జరీతో భూమిని మార్చుకున్నారు**

అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన శోభాబాయి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామ పరిధిలో ఉన్న సర్వే నంబరు 803లో 49 సెంట్ల భూమికి ముగ్గురు భాగస్వాములలో ఒకరుగా తమ భర్త ఉన్నారు. కానీ తమ భర్త మరణానంతరం ఆ ఆస్తి తమ రావలసినప్పటికీ మిగతా భాగస్వాములు తమ అనుమ తి లేకుండా తన భర్త పేరు కొట్టివేసి ఫోర్జరీ చేసి ఆ భూమిని తమ పేర్లకు మార్చుకుని స్వాధీనం చేసుకున్నారు. వారిపై చర్యలు తీసు కుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## గురుకుల పాఠశాలలో ఎంపీ ఆకస్మిక తనిఖీ



ఏలూరు (చైతన్యరథం): వట్లూరు బాలికల గురుకుల పాఠశాలను గురువారం మధ్యాహ్నం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. గురుకుల పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. భోజనశాలలను తనిఖీ చేసిన ఎంపీ వసతి సౌకర్యాలు, ఆహార పదార్థాల మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన ఎంపీ, కాసేపు విద్యార్థినులతో ముచ్చటించారు. గురుకుల పాఠశాలను పరిశుభ్రంగా, అన్ని సౌకర్యాలతో, ఉన్నత ప్రమాణాలతో నిర్వహిస్తున్న వార్డెన్ మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందించారు. విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా, సత్ప్రవర్తనతో తీర్చి దిద్దాల్సిందిగా అధ్యాపకులకు సూచించిన ఎంపీ ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని వార్డెన్‌కు ఇతర సిబ్బందికి హామీ ఇచ్చారు.

## ‘రైతన్నా మీకోసం’ తో వ్యవసాయాభివృద్ధికి మరింత తోడ్పాటు



బుట్టాయగూడెం (చైతన్యరథం): వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ‘రైతన్నా– మీకోసం’ కార్యక్రమం రైతులకు మరింత తోడ్పాటు అందిస్తుందని ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. గురువారం బుట్టాయగూడెం మండలం కండ్రికగూడెంలో ‘రైతన్నా–మీకోసం’పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి కరపత్రాల ద్వారా రైతులకు ఈ కార్యక్రమం గురించి వివరించారు. సందేహాలను నివృత్తి చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి కూడా తోడ్పడుతుందని తెలిపారు. రైతులందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సంక్షేమమే కూటమి ప్రభుత్వ పరమావధి

**•రాజకీయ వివక్షత లేకుండా పారదర్శకంగా సంక్షేమ ఫలాలు**



తుని (చైతన్యరథం): సంక్షేమమే కూటమి ప్రభుత్వ పరమావధి అని, రాజకీయ వివక్షత లేకుండా పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందరికి అందిస్తున్నామని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే యనమల దివ్య వ్యాఖ్యానించారు. రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా గురువారం తేటగుంట మండల టీడీపీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు ఆధ్వర్యంలో ఆనూరు గ్రామంలో జరిగిన అన్నదాత సుఖీభవ ఇంటింటి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి అన్నదాతతో ముచ్చటించారు. అన్నదాత సుఖీభవ నిధుల అందాయా? లేదా? అనే విషయం గురించి వాకాబు చేశారు. తనను కలిసేందుకు వచ్చిన మహిళల సమస్యలను సావధానంగా అడిగి తెలుసుకున్న ఆమె... అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంచినీటి వెతలు తీర్చేందుకు వాటర్ ట్యాంక్‌ను మంజూరు చేయించామని ఎమ్మెల్యే చెప్పారు.

## అనకాపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



అనకాపల్లి (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కొత్తపెంటలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ విజయకృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. అనంతరం ఆరుతడి పంటలకు రాయితీ విత్తనాలు అందజేశారు. రైతుల నుంచి ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని కలెక్టర్ అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తామన్నారు.

# రైతు సంక్షేమమే చంద్రన్న లక్ష్యం : గిడ్డి ఈశ్వరి



పాడేరు (చైతన్యరథం): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అందులో భాగంగానే రైతన్న మీకోసం కార్యక్రమం తీసుకొచ్చిందని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. పాడేరు మండలం కుజ్జెలి పంచాయితీ యెగుమోదాపుట్టు గ్రామంలో రైతన్నా.. మీకోసం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం వల్ల రాష్ట్రానికి అప్పులు అధికంగా ఉన్నా సరే వాటిని అధిగమించి రైతుల కోసం చంద్రన్న అన్నదాత సుఖీభవ పథకాన్ని తీసుకొచ్చారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయ పెట్టుబడికి పెట్టుబడి సాయంగా సంవత్సరానికి 20వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సాయంతో కలిపి అందిస్తున్నామని ఈశ్వరి పేర్కొన్నారు. రైతులు అధిక దిగుబడి సాధించాలని, ఆధునాతన పద్ధతులలో వ్యవసాయాన్ని చేయాలన్న ఉద్దేశంతో వారికి అవగాహన కల్పించాలని చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు ఏ పంటలను కోరుకుంటున్నారో ఆ పంటలను వేయడం ద్వారా రైతులకు ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందన్న విషయంపై అధికారులు అన్నదాతలకు కల్పించాలన్న ఉద్దేశం కార్యక్రమం ప్రధాన ధ్యేయమన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ పప్పు ధాన్యాలు తినేందుకు ఆసక్తి చూపుతున్నారని వాటికి ఎక్కువ డిమాండ్ ఉందని వాటిని పండించేందుకు రైతులు ఆసక్తి చూపాలని అందుకు సంబంధించిన మెలకువలను వ్యవసాయ అధికారుల ద్వారా తెలుసుకోవాలని సూచించారు.

## చీపురుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



చీపురుపల్లి (చైతన్యరథం): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరూ వినియోగించుకోవాలని ఏఎంసీ చైర్మన్ రేగాన రామారావు, జనసేన ఇన్‌ఛార్జ్ శ్రీనివాసరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కామునాయుడు అన్నారు. గురువారం చీపురుపల్లి మండలం రామలింగాపురం పీఏసీఎస్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, రైతుల వద్దకే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి (చైతన్యరథం): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. రైతన్నల శ్రేయస్సే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తరలించాలని దళారాలను నమ్మి మోసపోవద్దని కోరారు. నకరికల్లు మండలం నరసింగపాడు గ్రామం రైతుసేవ కేంద్రం నందు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ... జగన్ పాలనలో రైతులు ధాన్యం అమ్మాలంటే నానా కష్టాలు పడేవారు. అమ్మిన ధాన్యం డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలిసేది కాదు. ప్రస్తుతం చంద్రబాబు పాలనలో రైతులు తమకు నచ్చిన మిల్లుల్లో నచ్చిన ధరకు ధాన్యం వాట్సాప్ లోనే అమ్మేయవచ్చు. 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో పడిపోతున్నాయి. మీ సమక్షంలో మీ గ్రామంలోనే రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు. ఏ రైతు కూడా నాణ్యతా ప్రమాణాల ప్రకారము ఉన్న తన పంటని కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదు. దళారులు లేక మధ్యవర్తులు మరియు మిల్లర్ల చేతిలో మన రైతన్నలు నష్టపోరిరదు ఎటువంటి మోసాలకు తావు ఉండకూడదు. రైతు సేవా కేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా కూడా పనిచేస్తాయి. ఈ కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు రైతులు తన ధాన్యాన్ని విక్రయించుకోవచ్చు. పంట నమోదు చేసుకొని కేవైసీ పూర్తి అయిన రైతులు, తమ ధాన్యాన్ని విక్రయించుటకు సిద్ధమైన రైతుల వద్ద నుండి మాత్రమే ధాన్యం కొనుగోల చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం విక్రయములో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఫిర్యాదు చేయుటకు ప్రతి జిల్లా కేంద్రంలో మరియు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, టోల్ ఫ్రీ నెంబర్ 1967ని సంప్రదించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కోరారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న ప్రభుత్వ అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి : తంగిరాల

నందిగామ (చైతన్యరథం): నందిగామ మండలం పెద్దవరంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ భవనానికి క్రెక్స్ బయోటెక్ ఎండీ రవిచంద్రతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్సీ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని చెప్పారు. కమ్యూనిటీ భవన నిర్మాణం వల్ల గ్రామంలోని ఎస్సీ వర్గ ప్రజలకు సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## సింహాచలం దేవస్థానంలో ప్రక్షాళన : ఎమ్మెల్యే గంటా

సింహాచలం (చైతన్యరథం): సింహాచలం దేవస్థానంలో గత వైసీపీ పాలనలోని అవశేషాలు ఇంకా కొనసాగుతున్నాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సింహగిరిపై పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. సింహాచలం క్షేత్రాన్ని కొందరు వివాదాలకు చిరునామాగా మార్చారన్నారు. దేవస్థానాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు.

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు లక్ష్యం

- ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం
- సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- 51 మంది లబ్ధిదారులకు రూ.32 లక్షలు విలువగల చెక్కులు అందజేత



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలోని పేద ప్రజలు ఆరోగ్య విషయంలో ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వారిని ఆదుకుంటున్నారు.. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించటంతోపాటు, రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పెట్టుకున్నారని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ గురునానక్ కాలనీలోని విజయవాడ పార్టీ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో గురువారం సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.32 లక్షలు విలువ గల చెక్కులను 51 మంది లబ్ధిదారులకు ఎంపీ కేశినేని శివనాథ్ గురువారం అందజేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి ఎంపీ తెలుగుసుకున్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న 51 మంది లబ్ధిదారుల్లో తిరువూరు పట్టణానికి చెందిన వారు 8 మంది, విస్సన్నపేట మండలానికి చెందిన వారు 12మంది, గంపలగూడెం మండలానికి చెందిన వారు 8 మంది, ఎ.కొండూరు మండలానికి చెందిన వారు 8 మంది, విజయవాడకు చెందిన వారు 15 మంది వున్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 400 మంది లబ్ధిదారులు రూ 3 కోట్ల 45 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ సహాయం పొందారని ఎంపీ స్పష్టం చేశారు.

ఈ చెక్కులు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, కష్టకాలంలో కుటుంబాలకు కొత్త జీవితం అందించేందుకు అండగా నిలుస్తాయి.. అనారోగ్య సమస్యలు, ఇతరత్రా అత్యవసరాల సమయంలో ప్రభుత్వ సహాయం ఎంతో పెద్ద తోడ్పాటు అవుతుందన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజల కోసం ఎన్డీయే కూటమి నాయకులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని తెలిపారు. కాగా ఎంపీ కేశినేని శివనాథ్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రె శ్రీనివాస చక్రవర్తి, నాయకులు వల్లభనేని నరసింహ చౌదరి, మాదిగాని గురునాథం, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్ (దళిత రత్న), విజయవాడ అర్బన్ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

# సాగును నిండా ముంచిన ఘనుడు జగన్ : ప్రత్తిపాటి

**•2019 ఎన్నికలకు ముందు రైతులకిచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయని రైతు ద్రోహి**



చిలకలూరిపేట (చైతన్యరథం): వ్యవసాయాధారిత దేశంలో ఏ రాజకీయ నాయకుడు చేయనంత అన్యాయం, ద్రోహం, మోసం జగన్ రాష్ట్ర రైతాంగానికి, వ్యవసాయానికి చేశాడని, 2019 ఎన్నికలకు ముందు అధికార కాంక్షతో అన్నదాతలకు అడ్డగోలుగా హామీలిచ్చి, ముఖ్యమంత్రి అయ్యాక వారిని నిండా ముంచిన రైతుద్రోహి జగన్ అని మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం రాత్రి నాదెండ్ల మండలం గణపవరంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. గ్రామంలోని రైతుల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. ప్రభుత్వం ఆచరణలో పెట్టాలనుకుంటున్న పంచసూత్రాల ప్రాముఖ్యతను వివరించి, ఏం పంటలు వేశారు..ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ చుట్టూ రూ.10లక్షలతో నిర్మించే డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, గ్రామస్తుల్ని ఉద్దేశించి మాట్లాడారు.

ధరల స్థిరీకరణ, విపత్తుల నిధితో రైతుల్ని ఆదుకుంటానన్న జగన్ .. చివరకు తన నిధిని మాత్రం బాగా పెంచుకున్నాడు. ఐదేళ్లపాటు రైతుల్ని, వ్యవసాయాన్ని పూర్తిగా విస్మరించి, న్యాయం చేయమని అడిగిన రైతుల్ని ఇష్టానుసారం దూషించి, కేసులు పెట్టించిన వైసీపీనేతలు.. జగన్, నేడు రైతులకు అన్యాయం జరుగుతుందని మొసలికన్నీరు కారుస్తున్నాడని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారం కోసం రైతుల్ని పావులుగా వాడుకొని, చివరకు ముఖ్యమంత్రి అయ్యాక వారిని మోసగించిన ఏకైక నాయకుడిగా జగన్ చరిత్రలో నిలిచిపోతాడన్నారు. రైతుభరోసా కింద ఏటా ప్రతిరైతుకు రూ.13,500 ఆర్థిక సాయం అందిస్తానన్న జగన్ చివరకు అరకొరగా, కొందరు రైతులకే రూ.7,500లు ఇచ్చింది జగన్ కాదా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. రూ.3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి, రూ.4 వేలకోట్ల ప్రకృతి విపత్తుల నిధి ఏర్పాటు చేస్తానని చివరకు తన నిధిని మాత్రం జగన్ బాగా పెంచుకున్నాడన్నారు. రైతులకు ఏర్పాటు చేస్తానన్న నిధులు ఏ ప్యాలెస్‌లో దాచాడో జగన్ ఇప్పటికైనా చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ పెంట్యాల శేషయ్య, టీడీపీ నాయకులు కెల్లంపల్లి ఆచయ్య, వలేటి హిమవంతరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే చంద్రన్న లక్ష్యం : కొమ్మాలపాటి



పల్నాడు (చైతన్యరథం): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అందులో భాగంగానే రైతన్న మీకోసం కార్యక్రమం తీసుకొచ్చిందని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం వల్ల రాష్ట్రానికి అప్పులు అధికంగా ఉన్నా సరే వాటిని అధిగమించి రైతుల కోసం చంద్రన్న అన్నదాత సుఖీభవ పథకాన్ని తీసుకొచ్చారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయ పెట్టుబడికి పెట్టుబడి సాయంగా సంవత్సరానికి 20వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సాయంతో కలిపి అందిస్తున్నామని అన్నారు. దానిలో భాగంగా మొదట రెండు విడతలు ఇవ్వడం జరిగిందన్నారు. మొదట విడతలో పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ కలిపి రూ.7000 రెండో విడతలో మరో రూ.7000 ఇచ్చామని చెప్పారు. ఇవి రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించే సమయంలో ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. దీంతో పాటు రైతులు అధిక దిగుబడి సాధించాలని, అధినాతన పద్ధతులలో వ్యవసాయాన్ని చేయాలన్న ఉద్దేశంతో వారికి అవగాహన కల్పించాలని చంద్రబాబు నాయుడు గారు కూటమి ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు ఏ పంటలను కోరుకుంటున్నారో ఆ పంటలను వేయడం ద్వారా రైతులకు ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందన్న విషయంపై అధికారులు అన్నదాతలకు కల్పించాలన్న ఉద్దేశం కార్యక్రమం ప్రధాన ధ్యేయమన్నారు.

# జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టండి : యార్లగడ్డ

**•ఎన్.హెచ్ పిడికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విజ్ఞప్తి**



గన్నవరం (చైతన్యరథం): చెన్నై- కోల్ కత్తా జాతీయ రహదారిపై గన్నవరం నియోజకవర్గం పరిధిలో నానాటికి పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జాతీయ రహదారుల సంస్థ అధికారులను కోరారు. ఈ మేరకు జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్ కు వినతి పత్రం అందచేశారు. గన్నవరం నియోజకవర్గ పరిధిలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగిందని యార్లగడ్డ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులను డిమాండ్ చేసారు. 65 నెంబర్ జాతీయ రహదారి బొమ్ములూరు టోల్గేట్ నుండి గన్నవరం ఆర్టీవో చెక్పోస్ట్ వరకు ఉన్న 33 కిలోమీటర్ల పొడవునా 2024వ సంవత్సరం 102 ప్రమాదాలు జరగగా ఈ ఏడాది ఇప్పటివరకు 84 ప్రమాదాలు జరిగాయని చెప్పారు. ఈ 33 కిలోమీటర్ల పరిధిలో నే ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వీరవల్లి హెచ్పి ఆయిల్ బంకు వద్ద జాతీయ రహదారి మలుపు ఉండటంతో అక్కడ అధికవేగంతో వీళ్ళే వాహనాల వేగం కంట్రోల్ అవ్వక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా పెద్దావుటపల్లి ఫ్లైఓవర్ నుండి ఆర్టీవో చెక్పోస్ట్ వరకు రోడ్ ప్రమాదాలు ఎక్కువగా జరగడంతో పాటు ప్రాణ నష్టం అధికంగా ఉంటున్నాయి. ఆర్టీవో చెక్పోస్ట్ సమీపంలో ఈ నెల 23వ తేదీ ఉదయం, రాత్రి ఒకేరోజు రెండు ప్రమాదాలు జరగటం ప్రమాదాల తీవ్రతకు అద్దం పడుతుందన్నారు. జాతీయ రహదారిపై వాహనాల అతివేగంగా వెళ్లడం ప్రమాదాలకు ఒక కారణంగా ఆయన పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్ల వద్ద, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. హనుమాన్ జంక్షన్ నుండి విజయవాడ వచ్చే వైపు పెద్దావుటపల్లి నుండి ఆర్టీవో చెక్పోస్ట్ వరకు జాతీయ రహదారి 1075 కిలోమీటర్ల నుండి 1077 కిలోమీటర్ల వరకు ' వై ' ఆకారంలో ఫ్లైఓవర్ నిర్మిస్తే ప్రమాదాలు నివారణకు వీలుంటుందని వివరించారు.

# గుంటూరు పశ్చిమలో అభివృద్ధి పనులు వేగవంతం

**•రూ.16.44 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్రలు నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో మొత్తం రూ.16.44 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, వాటర్ పైప్‌లైన్లు వంటి కీలక మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేశామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... "కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గుంటూరు పశ్చిమలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని,8 డివిజన్లలో 16 కోట్లకు పైగా అభివృద్ధి పనులకి ఒకే రోజు శంకుస్థాపన చేయటం జరిగింది. ప్రజలు కోరిన ప్రతి అభివృద్ధి పనిని వెంటనే అంచనాలు తయారు చేయించి మంజూరు చేయడంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# రైతన్న సేవలో... మన మంచి ప్రభుత్వం



పెడన (చైతన్యరథం): నియోజకవర్గం గూడూరు మండలం కాంచకోడూరు గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతన్నా నీకోసం కార్యక్రమంలో పాల్గొన్న పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు రైతుల ఇళ్ల వద్దకు నేరుగా వెళ్ళి, కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వ్యవసాయంలో రాబడికి తీసుకోవాల్సిన చర్యలు రూపొందించి, పంచసూత్రాల రూపంలో రైతుకు తెలియచేస్తూ, పంటలో దిగుబడి సాధించేలా రైతుకు తోడ్పాటు ఇచ్చేవిధంగా, రైతు వద్దకు నేరుగా రావడం జరిగిందని, రైతులతో కలిసి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు.

# మంత్రి లోకేష్ బాటలో పాఠశాలల అభివృద్ధి

## ఎంపీ, ఎమ్మెల్సీ బీద సోదరుల వెల్లడి




కావలి, (చైతన్యరథం): ఇస్కపల్లి హైస్కూల్ ప్రభుత్వ పాఠశాలలకు రోల్ మోడల్‌గా ఇస్కపల్లి హైస్కూల్ ను తీర్చిదిద్దుతామని బీద రవిచంద్ర సోదరులు వెల్లడించారు. ప్రయాణ దూరంతో ఏ ఒక్కరూ పాఠశాల విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో 422 సైకిళ్లను విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. మిత్రులు దివ్వెల హరిశ్రీనివాస్ నిర్మించ తలపెట్టిన ఆధునిక వంట గది, భోజనశాలల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ, ప్రజా సమన్వయం తో గతంలో ప్రగతి సాధించిన "జన్మభూమి" విధానానికి నారా లోకేష్ మళ్ళీ శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ప్రైవేటు స్కూల్స్ పై మోజు వీడి, అన్ని సౌకర్యాలను ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో ధైర్యంగా పిల్లల్ని చేర్చాలని పిలుపునిచ్చారు. ఇస్కపల్లి హైస్కూల్ విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చేవరకు నేను, బీద మస్తాన్‌రావు అండగా ఉంటామన్నారు. గ్రామస్థులకు ఉపాధి కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. బీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇస్కపల్లి గ్రామ హైస్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, హెచ్‌పీఆర్ అధినేత హరి శ్రీనివాస్, పెన్నా డెల్టా వైస్ చైర్మన్ బీద గిరిధర్, డాక్టర్ లోకనాథం, దేవరాల సుబ్రమణ్యం, స్థానిక సర్పంచ్, ఎంపీపీ, హై స్కూల్ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.




# అన్నదాత అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యం

## ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టీకరణ

అద్దంకి, (చైతన్యరథం): అర్హత కలిగిన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ ద్వారా పెట్టుబడి సాయం అందిస్తామని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రైతు సేవలో - మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కేవలం ప్రభుత్వం వైపు నుంచి మాత్రమే కాకుండా రైతులు కూడా పంట మార్పిడి పై దృష్టి సారించి మెరుగైనా దిగుబడులు సాధించాలని కోరారు. సేంద్రీయ వ్యవసాయం దిశగా అన్నదాతలు అడుగులు వేస్తే బాగుంటుందని పేర్కొన్న మంత్రి గొట్టిపాటి.. పంటలకు పురుగుమందు వాడకం తగ్గించాలని సూచించారు. గత ప్రభుత్వం రైతులకు ధాన్యం కొనుగోలు డబ్బును చెల్లించలేదని తెలిపిన మంత్రి... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. రైతు సేవలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రసంగించిన మంత్రి గొట్టిపాటి... మొదటి విడతలో ఇనాం భూముల రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు అందక పోవడంతో స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించి సమస్యను పరిష్కరించినట్లు వెల్లడించారు. మొదటి విడత రూ.5 వేలు అందని రైతులకు రెండో విడత రూ.5 వేలు కలిపి జమ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. రెండవ విడతలోనూ నిధులు జమకాని కొంత మంది ఇనాం రైతుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# అభివృద్ధి పనుల్లో నిధుల మంజూరుకు సహకరించండి

## మంత్రి ఆనంతో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భేటీ



దర్శి, (చైతన్యరథం): నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల మంజూరు, దేవాలయాల అభివృద్ధి, మౌలిక వసతుల పనుల పురోగతి వంటి ముఖ్య అంశాలపై టిడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గురువారం సాయంత్రం జిల్లా ఇన్‌ఛార్జ్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు, మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు. అవసరమైన నిధుల మంజూరుకు ప్రభుత్వ సహకారం కొనసాగించాలని మంత్రిని కోరారు. ఇటీవల తుపాను కారణంగా రైతులకు జరిగిన భారీ నష్టంపై తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రిని డాక్టర్ లక్ష్మి అభ్యర్థించారు. పొగాకు, పత్తి, అపరాలు, వరి, కూరగాయలు, పండ్ల తోటల రైతులు తీవ్రంగా నష్టపోయారని, సంబంధిత నివేదికను కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు. దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేవవరం గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం లేని వ్యవసాయ భూముల పట్టాల సమస్యపై కూడా మంత్రికి వివరించగా, లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసేందుకు సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ లక్ష్మి తెలిపారు.





మార్కాపురం నూతన జిల్లా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి మార్కాపురం జిల్లా ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేసిన మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుమల ఆశోక్‌రెడ్డి

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే సీఎం చంద్రబాబు లక్ష్యం

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ, (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీని అభివృద్ధి పథం వైపు నడిపించటంతోపాటు, రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పెట్టుకున్నారని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో గురువారం సీఎంఆర్ ఎఫ్ కింద మంజూరైన రూ.32 లక్షలు విలువ గల చెక్కులను 51 మంది లబ్ధిదారులకు ఎంపీ కేశినేని శివనాథ్ అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్ అందుకున్న 51 మంది లబ్ధిదారుల్లో తిరువూరు పట్టణానికి చెందిన వారు 8 మంది, విస్సన్నపేట మండలంలో 12 మంది, గంపలగూడెం మండలం, 8 మంది, ఎ.కొండూరు మండలంలో 8 మంది, విజయవాడకు చెందిన వారు 15 మంది వున్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజలు ఆరోగ్య విషయంలో ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వారిని ఆదుకుంటున్నారన్నారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో400 మందికి లబ్ధిదారులు రూ 3 కోట్ల 45 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ సహాయం పొందారని ఎంపీ స్పష్టం చేశారు. అనారోగ్య సమస్యలు, ఇతరత్రా అత్యవసరాల సమయంలో ప్రభుత్వ సహాయం ఎంతో పెద్ద తోడ్పాటు అవుతుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎంపీ కేశినేని శివనాథ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టిడిపి ఎన్టీఆర్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రి శ్రీనివాస చక్రవర్తి, టిడిపి నాయకులు వల్లభనేని నరసింహా చౌదరి, మాదిగాని గురునాథం, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్ (దళిత రత్న), విజయవాడ అర్బన్ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు ఇర్ఫాన్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీని మరింత బలోపేతం చేయాలి

## ఐడీసీ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని

నందిగామ, (చైతన్యరథం): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అదేశానుసారం బూత్ బలోపేత ప్రచార కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం నందిగామ మండలం పెద్దవరం గ్రామ పరిధిలోని బూత్ నంబర్ 57లో జరిగిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని అబ్జర్వర్‌గా పాల్గొన్నారు, ఈ సమావేశంలో 57 వ బూత్ గత ఎన్నికల్లో తక్కువ మెజారిటీ రావడం పై విశ్లేషణ చేసి బూత్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు, ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు పాల్గొని,తదనంతరం 57 బూత్ లో సంక్షేమ పథకాల గురించి వివరించారు.



# ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ

## కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, ఎమ్మెల్యే సతీమణి ఉమాదేవి



మడకశిర, (చైతన్యరథం): మడకశిర మండలం, ఆమిదాలగొంది పంచాయతీ, డి.రామగిరి గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి స్థానిక శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు రాజు సతీమణి ఉమాదేవి పాల్గొన్నారు. గ్రామస్తులు వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని బహూకరించారు. శాస్త్రోక్తంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం గ్రామస్తులను ఉమాదేవి ఆప్యాయంగా పలకరించారు. తదనంతరం ఆమిదాలగొంది గ్రామంలో రైతన్నా..మీకోసం కార్యక్రమంలో ఉమాదేవి పాల్గొన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలపై ప్రచారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగం కోసం చేస్తున్న పలు కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమం అనంతరం మడకశిర మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమాదేవితో పాటు రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్లు, కౌన్సిలర్లు, క్లస్టర్ ఇన్చార్జులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ కమిటీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

## కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి వెల్లడి

కడప, (చైతన్యరథం): కడప నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం "ప్రజా దర్బార్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి నేరుగా వినతులు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అందించిన అర్జీలను పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అక్కడికక్కడే సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రథమ ప్రాధాన్యత అని వారు తెలిపారు.

# రైతు సమస్యల పరిష్కారానికి కృషి

## ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి



ఎమ్మిగనూరు, (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు మండలం వెంకటగిరి గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పనితీరు పట్ల రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, సచివాలయంతో పాటు రైతు సేవ కేంద్రాలను సందర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తను పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, ఎల్ఎల్‌సీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, అధికారులు, రైతులు, మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాచర్ల ఇన్నర్ బైపాస్‌కు భూమిపూజ

## పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల, (చైతన్యరథం): రూ. 54.09 కోట్లతో నిర్మించనున్న మాచర్ల, రెంటచింతల, గురజాల పట్టణాల ఇన్నర్ బైపాస్ రోడ్డు విస్తరణ పనులకు మాచర్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి. బ్రహ్మానందరెడ్డి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మాచర్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, మాచర్ల టౌన్ అధ్యక్షులు కొమెరా దుర్గారావు, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యెనుముల కేశవరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కజ్జం సైదయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజబోయిన మధు యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ మదర్ సాహెబ్, గురజాల ఆర్టీఓ మురళీకృష్ణ, మాచర్ల టౌన్ ఎమ్మార్వో కిరణ్, వజ్రం నాయక్, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి, (చైతన్యరథం): రైతు సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని చేపట్టిందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి రైతులకు సూచించారు. ఓడీ చెరువు మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డబురువారిపల్లిలో నిర్వహించిన రైతన్న సేవలో మన మంచి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో అన్నదాతకు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ద్వారా ఏటా రూ.20 వేలు మంజూరులో భాగంగా ఇప్పటికే రెండు విడతలుగా ఒక్కొక్క రైతుకు రూ. 14 వేల చొప్పున ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.







# ఆదోనిలో రైతన్నా మీకోసం మన మంచి ప్రభుత్వం

ఆదోని, (చైతన్యరథం): సంతెకల్లూరు గ్రామానికి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాలతో ఆదోని టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, రాష్ట్ర పూర్వ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప ఆధ్వర్యంలో రైతన్న మీకోసం - మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రైతులకు రావాల్సిన సబ్సిడీలు, అన్నిటినీ ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు జై శంకర్, రంగస్వామి నాయుడు, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ రామకృష్ణ,రంగన్న, బసవరాజు, అయ్యన్న, వీరేష్, గిడ్డయ్య, రాము, శ్రీరాములు, నాగరాజు, సయ్యద్, సిద్ధ, గోవిందప్ప, ఎల్లప్ప, మల్లికార్జున, సోమన్న, కేశప్ప, వీరేష్, పీరా, ఎల్లప్ప, ఈరన్న పాల్గొన్నారు.



# సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం

## ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



మార్కాపురం, (చైతన్యరథం): మార్కాపురం ప్రత్యేక జిల్లా ప్రకటించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. గురువారం మార్కాపురం పట్టణంలోని 25వ వార్డులో ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజలు మహిళలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డికి కృతజ్ఞత తెలియజేయడానికి పాలాభిషేకం నిర్వహించారు. సందర్భంగా నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జి కందుల రామిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ చంద్రబాబు నాయుడుకు రుణపడి ఉంటామని అన్నారు. అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలని గతంలో కోరామని గత ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన జరిగినప్పుడు ఎంతో వివక్షతో ఈ ప్రాంతాన్ని విస్మరించారన్నారు. గతంలో హామీ ఇచ్చిన విధంగానే ఇప్పుడు మార్కాపురం జిల్లా ప్రకటించటం చంద్రబాబు నాయుడుకు ఈ ప్రాంత ప్రజలు ఎంతో రుణపడి ఎప్పటికి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# ఢిల్లీ బాంబు పేలుడు కేసులో కదులుతున్న డొంక

## విచారణతో వెలుగులోకి విస్తుపోయే వాస్తవాలు



ఢిల్లీ కారు బాంబు పేలుడు కేసులో విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. నిందితురాలు డాక్టర్ షాహిన్ షహిద్ గర్ల్ ఫ్రెండ్ కాదని, తన భార్య అని సహ నిందితుడు ముజమ్మిల్ షకీల్ విచారణలో భాగంగా వెల్లడించాడు. 2023లో తమ నిఖా జరిగిందని చెప్పాడు. అల్‌ఫలా యూనివర్సిటీ సమీపంలోని మతపరమైన ప్రదేశం అందుకు వేదికైందని తెలిపాడు. ఈ మేరకు దర్యాప్తు అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2023లో ఆయుధాలు కొనేందుకు ముజమ్మిల్‌కు షాహిన్ రూ.6.5 లక్షలు ఇచ్చిందని, 2024లో బాంబర్ ఉమర్ నబీకి ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు కొనేందుకు రూ. 3లక్షలు ఇచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ క్రమంలో ముజమ్మిల్, షాహిన్ బంధం గురించి బయటకు వచ్చింది. దీనిద్వారా షాహిన్‌కు జైషే మహమ్మద్ మాడ్యూల్‌తో ఉన్న సంబంధాలు వెల్లడవుతాయనే దిశగా అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. అలాగే ఆ మాడ్యూల్ ఆయుధాలు, పేలుడు పదార్థాలు సమీకరించుకునేందుకు ఆమె రూ.27 లక్షలు, 28 లక్షలు ఇచ్చినట్లు సమాచారం. అయితే అది మతపరమైన విరాళమని ఆమె దర్యాప్తులో వెల్లడించినట్లు తెలుస్తోంది. జైషే మహిళా విభాగంలో షాహిన్ కీలక పాత్ర పోషిస్తోందని ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. భారత్ ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబం ఛిన్నాభిన్నమయింది. ఉగ్ర సంస్థకు చెందిన ప్రధాన కేంద్రం కూడా ధ్వంసమయింది. ఈ క్రమంలో జైషే మహిళా బ్రిగేడ్‌ల ఏర్పాటుకు ఆన్లైన్ కోర్సులు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ జమాత్ ఉల్ మొమినాత్ విభాగానికి మసూద్ సోదరి సాదియా అజార్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ విభాగంలో షాహినకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. పాక్‌లోని ఉగ్రవాదుల నుంచి అందుతున్న ఆదేశాలతో భారత్‌లో మహిళా విభాగాలు స్థాపించి, వారి నియామకాలు చేపట్టడం వంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. నవంబర్ 10న ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు వెనక కుట్ర కోణాలను జాతీయ దర్యాప్తు సంస్థ విచారిస్తోంది. దానిలో భాగంగా ఇప్పటి వరకు ఏడుగురిని అరెస్టు చేసింది.



# సామాజిక మాధ్యమాలపై కట్టడి కావాలి

## మార్గదర్శకాల రూపకల్పనకు కేంద్రానికి సుప్రీం గడువు

ఆన్లైన్ కంటెంట్ నియంత్రణపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సామాజిక మాధ్యమాల్లో అప్లోడ్ చేసే కంటెంట్ పై ఎవరో ఒకరు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. వ్యక్తులు సొంతంగా ఛానళ్లు ప్రారంభించి.. ఆ తర్వాత బాధ్యతారాహిత్యంగా ఉండటం వింతగా ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. యూట్యూబర్ రజ్వీర్ అలహాబాదియా కేసు విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారం గురించి ప్రశ్నింది ప్రముఖ యూట్యూబర్ రణవీర్ ఆలహాబాదియా వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే దీనికి సంబంధించిన కేసుపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ "ఇది కేవలం -అశ్లీలతకు సంబంధించిన అంశమే కాదు. సామాజిక మాధ్యమాల్లో యూజర్లు జనరేట్ చేస్తోన్న కంటెట్‌లోని లోపాలు ఎత్తిచూపుతోంది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అనేది అమూల్యమైన హక్కు అయితే దాన్ని వక్రీకరించడం సరికాదు" అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీజే జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ. "ఇది అసలు సమస్య. 'నేను సొంతంగా ఓ ఛానల్‌ను క్రియేట్ చేశాను. అందువల్ల ఎవరికీ జవాబుదారీగా ఉండను' అన్న సంకేతాలు వెళ్తున్నాయి. ఇది సరికాదు. ఆన్లైన్ కంటెంట్ విషయంలో ఎవరో ఒకరు బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది" అని అభిప్రాయపడ్డారు. "దేశ వ్యతిరేక కంటెంట్ ఉన్నప్పుడు.. క్రియేటర్ దానికి బాధ్యత వహిస్తారా? ఇలాంటి సందర్భాల్లో ప్రతిస్పందించేందుకు సమయం ఉండట్లేదు. అసభ్యకర కంటెంటును అప్లోడ్ చేసినప్పుడు, అధికారులు చర్యలు తీసుకునేలోపే అది వైరల్గా మారుతోంది. లక్షల మంది దాన్ని వీక్షిస్తున్నారు. అలాంటప్పుడు దీన్ని ఎలా నియంత్రిస్తారు?" అని ధర్మాసనం ప్రశ్నించింది. ఆన్లైన్ కంటెంట్‌ను పర్యవేక్షించే వ్యవస్థ ఉన్నప్పుడు ఎందుకు ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. వినియోగదారులు సృష్టించిన సోషల్ మీడియా కంటెంట్‌ను నియంత్రించేలా నిబంధనలను తీసుకురావడానికి కేంద్రానికి నాలుగు వారాల గడువు ఇస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది.

# ఆధార్‌కార్డు పౌరసత్వానికి రుజువు కాదు

## తేల్చి చెప్పిన సుప్రీం కోర్టు ధర్మాసనం




చొరబాటుదారులు ఆధార్ కార్డులు సంపాదించడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పౌరులు కానివారు ఆధార్ కలిగి ఉంటే వారికి ఓటు హక్కు కూడా ఇచ్చేయాలా? అని ప్రశ్నించింది. ఓటర్ల జాబితాలకు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై విచారణలో భాగంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్లలో సర్' కసరత్తుపై ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయల్ మాల్య బాగ్చి ధర్మాసనం గురువారం విచారించింది. ఈ సందర్భంగా పౌరసత్వానికి ఆధార్ ప్రూఫ్ కాదని స్పష్టం చేసింది. "ఆధార్ సామాజిక సంక్షేమ ప్రయోజనాలు అందరికీ చేరేలా చూసుకోవడానికి ఏర్పాటు చేసింది. మాత్రమే రేషన్ కోసం ఆధార్ పొందిన వ్యక్తిని ఓటరును చేయాలా? విదేశాలకు చెందినవారు ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తే వారికి కూడా ఓటు హక్కు కల్పించాలా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ఓటరు నమోదు ఫారం-6లో పేర్కొన్న వివరాలు సరైనవో, కావో నిర్ధరించుకునే, అధికారం ఈసీకి ఉందని తేల్చి చెప్పింది.కొంతమంది పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ సర్ ప్రక్రియ సాధారణ పౌరులపై రాజ్యాంగ విరుద్ధమైన భారాన్ని మోపుతోందన్నారు. వారిలో అనేక మంది నిరక్షరాస్యులు ఉన్నారన్నారు. ఈ మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్లో సర్ నిర్వహించడాన్ని ప్రత్యేకంగా సవాల్ చేసిన పిటిషన్ల విచారణకు సుప్రీం షెడ్యూల్ చేసింది. వచ్చేనెల ఒకటో తేదీలోగా స్పందన తెలియజేయాలని ఈసీని కోరింది.

# కర్ణాటక సీఎం రేసులో కొత్త పేర్లు

## నేను సైతం అంటున్న మంత్రి పరమేశ్వరప్ప, పనిలో పనిగా ఖర్గే పేరు కూడా



కర్ణాటకలో సీఎం మార్పు'పై పోరు ఇంకా కొనసాగుతోంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు అత్యంత సన్నిహితుడు, కర్ణాటక హోం మంత్రి జి పరమేశ్వర కీలక వ్యాఖ్యలు చేశారు. నాయకత్వ మార్పునకు అధిష్టానం అంగీకరించిన క్రమంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం అయ్యేందుకు తాను పూర్తిగా మద్దతిస్తానని తెలిపారు. ఓ మీడియాతో మాట్లాడుతూ పరమేశ్వర ఈ వ్యాఖ్యలు చేశారు. సీఎం ఆకాంక్షల గురించి ఎవరైనా అడిగితే, తాను కూడా రేసులో ఉన్నానని చెబుతుంటానని అయితే, అధికార మార్పిడి జరిగి డీకేకు సీఎం బాధ్యతలు అప్పగించినా తాము దానికి అంగీకరిస్తాం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకు కూడా ముఖ్యమంత్రి అవ్వాలనే ఆకాంక్ష ఉందన్నారు. పార్టీ కోసం తాను చేసిన కృషి గురించి హైకమాండ్‌కు పూర్తిగా తెలుసని, తుది నిర్ణయం వారిదేనని అన్నారు. ఆ క్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా కర్ణాటక సీఎం పదవికి తగిన వ్యక్తి అన్నారు. అయితే, సిద్ధూ, డీకేల మధ్య ఎలాంటి ఒప్పందం జరిగిందనే విషయం తనకు తెలియదు' అని అన్నారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై జరుగుతున్న ప్రచారానికి ఇంకా తెరపడలేదు. సీఎం సీటు కోసం సిద్ధూ, డీకేల మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతోంది. ఈ క్రమంలో సిద్ధూ శిబిరం నుంచి ఇలాంటి ప్రకటన రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నాయకత్వ మార్పుపై ఊహాగానాల వేళ.. డీకే శివకుమార్ పెట్టిన పోస్టు ఆసక్తిరంగా మారింది. మాట నిలబెట్టుకోవడం అనే అర్థం వచ్చేలా ఆయన ఎక్స్‌లో ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. దానిపై "ఒక మాటకు ప్రపంచానికి ఉన్నంత బలం ఉంటుందనే సామెత ఉంది. అంటే ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ప్రపంచంలోనే అతిముఖ్యమైన శక్తుల్లో ఒకటి. అది న్యాయమూర్తి, భారత రాష్ట్రపతి, నేను, మీరు, ఎవరైనా ఇచ్చిన మాటను గౌరవించాలి అని ఉంది. అధిష్టానాన్ని ఉద్దేశించే ఆయన ఈ పోస్టు పెట్టారంటూ నెట్టింట చర్చ జరుగుతోంది. కాగా ఈ సమస్యను పరిష్కరించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. త్వరలోనే అధిష్టానం దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## సిద్ధూకు తిరుగులేదంటున్న తనయుడు యతీంద్ర సిద్ధరామయ్య



మైసూరు, కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు వెల్లువెత్తుతున్న వేళ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్య గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. తన తండ్రిపై ఎలాంటి ఆరోపణలు లేవని, ఆయన ఎటువంటి కుంభకోణాల్లో భాగం కాలేదని పేర్కొన్నారు. సిద్ధరామయ్య సుపరిపాలన అందిస్తున్నారని, ఎమ్మెల్యేల మద్దతు కూడా ఆయనకే ఉందని తెలిపారు. అయితే, సీఎం మార్పు డిమాండ్‌పై పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి మార్పు గురించి ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. రెండున్నరేళ్ల తర్వాత ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం బాధ్యతలు అప్పగించేలా అప్పట్లో ఓ ఒప్పందం కుదిరిందని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో యతీంద్ర వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. అధికార పంపిణీ గురించి తనకు తెలియదని, ఎవరూ తనతో చెప్పలేదని ఆయన అన్నారు. ఇచ్చిన మాటకు సీఎం సిద్ధరామయ్య కట్టుబడి ఉంటారన్నారు. కానీ, ఆయన అధిష్ఠానానికి ఇచ్చిన మాట ఏంటనేది మాత్రం తాను చెప్పలేనని, ఆ విషయాన్ని ముఖ్యమంత్రినే అడగాలని అన్నారు.

# కాల్పులు.. ఉగ్రచర్యే

## వైట్‌హౌస్ వద్ద కాల్పుల ఘటనపై అధ్యక్షుడు ట్రంప్

అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం సమీపంలో జరిగిన కాల్పులు ఉగ్రచర్యేనని అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఈసందర్భంగా అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఈ కాల్పులకు కారణమని పరోక్షంగా ట్రంప్ విమర్శలు చేశారు. దీనిపై తాజాగా ట్రంప్ మాట్లాడుతూ.. 'ఇది ఒక దారుణమైన దాడి. విద్వేషపూరితమైన ఉగ్రవాద చర్య. ఇది మొత్తం దేశంపై జరిగిన దాడి. మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన దీన్ని మేం ఖండిస్తున్నాం' అని ట్రంప్ అన్నారు. కాల్పుల అనంతరం అదుపులోకి తీసుకున్న వ్యక్తి ఈ భూమిపైనే ప్రమాదకర ప్రాంతమైన అఫ్గానిస్థాన్‌కు చెందినవాడని పేర్కొన్నారు. అతడు జో బైడెన్ పరిపాలన సమయంలో యూఎస్‌లోకి ప్రవేశించాడన్నారు. ఈసందర్భంగా బైడెన్ అధికారంలో ఉన్నప్పుడు అఫ్గాన్‌నుంచి దేశంలోకి వచ్చిన వారందరినీ తిరిగి విచారించాల్సిన అవసరం ఉందన్నారు. శరణార్థులు తమ మనుగడకే ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. కాల్పుల నేపథ్యంలో వాషింగ్టన్‌లో మరో 500మంది నేషనల్ గార్డ్ దళాలను మోహరించాలని ఆదేశించినట్టు తెలిపారు.

అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం సమీపంలో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఓ దుండుగుడు నేషనల్ గార్డ్‌పై కాల్పులు జరిపాడు. ఘటనలో ఇద్దరు నేషనల్ గార్డ్స్ ప్రాణాలు విడిచినట్టు వెస్ట్ వర్జీనియా గవర్నర్ పాట్రిక్ మొరిసె సోషల్ మీడియాలో ప్రకటించారు. అయితే వారు తీవ్రంగా గాయపడ్డారని, వారి పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ పేర్కొన్నారు. ఈ ఘటనతో అప్రమత్తమైన బలగాలు అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నాయి. అతనికి సైతం బుల్లెట్ గాయాలు అయినట్టు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. కాల్పుల సమయంలో అదుపులోకి తీసుకున్న వ్యక్తి అఫ్గాన్ జాతీయుడని లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ధ్రువీకరించారు. అతడి పేరు రెహ్మానుల్లా లఖన్వాల్‌గా పేర్కొన్నారు. 2021లో అఫ్గాన్లకు అందించిన స్పెషల్ వీసాపై అగ్రరాజ్యానికి వచ్చినట్టు తెలిపారు. కాల్పుల్లో నిందితుడికి కూడా గాయాలవడంతో.. అతడిని ఆస్పత్రికి తరలించామన్నారు. అతడు ఒంటరిగానే ఈ దాడికి పాల్పడ్డాడని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. కాల్పులు జరిగిన ప్రాంతం అత్యంత భద్రత ఉండే వైట్హౌస్ జోన్ పరిధిలోకి వస్తుందని అధికారులు తెలిపారు. యూఎస్ సీక్రెట్ సర్వీస్ అధికారులు, ఇతర ఏజెన్సీలు కాల్పులు జరిగిన ప్రాంతానికి చేరుకొని దర్యాప్తు మొదలు పెట్టాయి. కాల్పుల ఘటనపై అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. నేషనల్ గార్డ్స్ కాల్పులు జరిపిన వ్యక్తిని మృగంతో పోల్చారు. కాల్పుల ఘటనకు మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు.




### అఫ్గాన్ల ఇమిగ్రేషన్ దరఖాస్తులు సస్పెండ్

ఇక, కాల్పుల నేపథ్యంలో యూఎస్ సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ కీలక నిర్ణయం తీసుకుంది. అఫ్గాన్ల ఇమిగ్రేషన్ దరఖాస్తులను వెంటనే నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. వాషింగ్టన్ డీసీ కాల్పుల ఘటనలో నిందితుడు అఫ్గాన్ వలసదారుడిగా తేలడంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇది వెంటనే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. దేశం, అమెరికన్ల భద్రతే తమకు ప్రాధాన్యమని వెల్లడించింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే వైట్ హౌస్ జోన్ పరిధిలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు నేషనల్ గార్డులు ప్రాణాలు కోల్పోయారని వెస్ట్ వర్జీనియా గవర్నర్ ప్రకటించారు. అయితే, నేషనల్ గార్డులు చనిపోలేదని తీవ్రంగా గాయపడ్డారని డైరెక్టర్ కాష్ పటేల్ పేర్కొన్నారు.



# జైలులో ఇమ్రాన్ క్షేమం..

## స్పష్టం చేసిన అధికారులు

*పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ జైల్లోనే మృతి చెందారంటూ పెద్దఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆ వార్తలను జైలు అధికారులు ఖండించారు. ఆయన ఆరోగ్యంగా ఉన్నారని, మంచి భోజనం అందిస్తున్నామని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. రావల్పిండి జైలు అధికారుల ప్రకటన ప్రకారం.. 'అడియాలా జైలునుంచి ఇమ్రాన్‌ను తరలించారంటూ వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదు. ఆయన పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారు. వైద్య సహాయం అందుతుంది. ఆయన మృతి చెందారంటూ జరుగుతున్న ప్రచారం నిరాధారమైనవి' అని పేర్కొన్నారు. పాక్ రక్షణ మంత్రి ఖవాజ్ ఆసిఫ్ కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేశారు. ఇమ్రాన్ బయటకంటే జైలులో సౌకర్యవంతంగా ఉన్నారన్నారు. ఫైవ్ స్టార్ హోటళ్లలో కూడా లభించని మంచి ఆహారాన్ని అతడు పొందుతున్నారన్నారు. ఆయనకు జైలులో విలాసవంతమైన సౌకర్యాలను అందిస్తున్నట్టు వెల్లడించారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్నారు. ఇమ్రాన్ జైలులోనే మరణించారంటూ నెట్టింట వదంతులు వచ్చాయి. బలూచిస్థాన్ విదేశాంగ శాఖ దీనిపై ఎక్స్‌లో పెట్టిన పోస్టు ఊహాగానాలను మరింత పెంచింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్‌ఐ కలిసి ఆయన్ని హతమార్చినట్టు వార్తలు వస్తున్నాయని ఆ పోస్టులో రాసుకొచ్చింది. పలు మీడియా సంస్థల నుంచి దీనిపై వార్తలు రావడంతో.. ఆయన మద్దతుదారులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతివ్వాలని ఆయన సోదరీమణులతో కలిసి డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు తమపై విచక్షణారహితంగా ప్రవర్తించారని ఇమ్రాన్ సోదరీమణులు ఆరోపించారు. మాజీ ప్రధానిని కలిసేందుకు జైలు అధికారులు అనుమతివ్వకపోవడంతో ఆయన మృతి వార్తలు మరింత ఊపందుకున్నాయి. తాజాగా ఈ వార్తలను జైలు అధికారులు ఖండించారు.*

# పాలిస్టరైన్లే.. ప్రమాద తీవ్రతకు కారణం?

**- హాంకాంగ్ అగ్నిప్రమాదంలో వెలుగులోకి కీలక విషయాలు**

**- ఆరు దశాబ్దాలలో ఇదే ఘోర ప్రమాదం**



హాంకాంగ్‌లోని ఆకాశహర్మ్యపు హౌసింగ్ కాంప్లెక్స్‌లో మంటలు చెలరేగి 50మందికి పైగా మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆరు దశాబ్దాల్లో ఇదే అతిపెద్ద అగ్ని ప్రమాదమని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి తాజాగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ భవంతుల కిటికీల వద్ద మరమ్మతుల కోసం ఉంచిన పాలిస్టరైన్ బోర్డులవల్లే మంటల తీవ్రత పెరిగినట్టు తెలుస్తోంది. అగ్ని ప్రమాదానికి కచ్చితమైన కారణమేంటో ఇంకా తెలియరాలేదు. అయితే, మంటలు వ్యాప్తి మాత్రం అసాధారణ రీతిలో చాలావేగంగా ఉందని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. కిటికీల వద్ద బోర్డులు ఇందుకు కారణమై ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. మరమ్మతుల నేపథ్యంలో ఈ భవంతులకు ఉన్న కిటికీలకు పాలిస్టరైన్ బోర్డులను అమర్చారు. దీనికి మండే స్వభావం ఎక్కువగా ఉంటుంది. నిన్న అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే మంటలు ఈ బోర్డులకు అంటుకున్నాయని, దీంతో వేగంగా పలు అపార్ట్‌మెంటులకు వ్యాపించడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని అధికారులు చెబుతున్నారు. ఈ బోర్డులను ఎందుకు ఏర్పాటుచేశారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంకా కొన్ని బ్లాక్‌లు మండుతూనే ఉన్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

### ఒక్కసారిగా ఏడు టవర్లకు పాకిన మంటలు

ప్రమాదం జరిగిన హౌసింగ్ కాంప్లెక్సును 1983లో నిర్మించారు. ఇందులో మొత్తం 8 టవర్లున్నాయి. ఒక్కోటి 31 అంతస్తులతో ఉన్న ఎత్తైన కట్టడాలివి. అయితే, ఈ టవర్లన్నీ చాలా దగ్గర దగ్గరగా ఉన్నాయి. మొత్తం 1,984 ఫ్లాట్లు ఉండగా.. ఇందులో దాదాపు 4,600 మంది నివసిస్తున్నారని అధికారులు తెలిపారు. నిన్నటి ఘటనలో ఇందులోని 7 టవర్లకు మంటలు అంటుకున్నాయి. ప్రస్తుతం ఈ భవన సముదాయాలకు మరమ్మతులు చేస్తున్నారు. ఈ పనుల కోసం వెదురు బొంగులు, ఆకుపచ్చ రంగులో ఉండే నిర్మాణ మెష్లు ఏర్పాటు చేశారు. వీటివల్ల కూడా మంటల తీవ్రత పెరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇవి అగ్నినిరోధక ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా? లేదా అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. ఇక్కడ నివసిస్తున్న వారిలో 40శాతానికి పైగా 65ఏళ్ల పైబడినే వారేనని తెలుస్తోంది. వీరు భవనం నిర్మించినప్పటి నుంచి ఇందులోనే ఉంటున్నట్టు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

### కిటికీల వద్ద సిగరెట్ పీకలే కాల్చాయా..?

ఈ ప్రమాదంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. "మరమ్మతుల పేరుతో ఏడాదికి పైగా అపార్ట్‌మెంట్ కిటికీలను సీల్ చేసే ఉంచారు. చాలా కిటికీల వద్ద సిగరెట్ పీకలు కన్పించాయి. వీటిగురించి అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. మరమ్మతుల సమయంలో కొన్ని ఫైర్ అలారంలను ఆపివేశారు. దీంతో ప్రమాదం జరిగినప్పుడు విషయం అందరికీ తెలియలేదు. "ఇది ప్రమాదం కాదు. చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు" అని స్థానిక మహిళ ఒకరు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 55 మంది మృతిచెందగా.. ఇంకా 270 మందికి పైగా ఆచూకీ తెలియరాలేదు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన స్థానిక పోలీసులు ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ భవంతులు మంటల్లో కాలిపోతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

### 60 ఏళ్లలో భారీ దుర్ఘటన..


హాంకాంగ్ ఈ స్థాయిలో అగ్నిప్రమాదం జరగడం 60 ఏళ్లలో ఇదే తొలిసారి. అంతకుముందు 1962లో షామ్ షుయ్ పో ప్రాంతంలో ఓ భవనంలో మంటలు చెలరేగి 44మంది మృతి చెందారు. ఆ భవనంలో భారీగా బాణసంచాను నిల్వ ఉంచారు. దీంతో ప్రమాద తీవ్రత పెరిగినట్టు నాడు అధికారులు వెల్లడించారు. ఇక, 1996లో గార్లే బిల్డింగ్‌లో జరిగిన ప్రమాదంలో 41మంది ప్రాణాలు కోల్పోయారు.

## సైక్లోన్ సెన్యార్ వేళ..

# సుమత్రా దీవుల్లో భూకంపం

**-ప్రకృతి విపత్తులతో ఇండోనేసియా ఉక్కిరిబిక్కిరి**

ఇండోనేసియాలోని సుమత్రా దీవుల్లో భారీ భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.3గా నమోదైంది. భూకంప కేంద్రం ఆషే ప్రావిన్సు సమీపంలో భూఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతున నమోదైనట్టు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇప్పటికే కొండచరియలు, ఆకస్మిక వరదలతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న ఆ దేశాన్ని ఈ ప్రకృతి విపత్తు వణికించింది. సైక్లోన్ సెన్యార్ కారణంగా సుమిత్రా దీవుల్లో ఆకస్మిక వరదలు సంభవించాయి. దాంతో ఇప్పటివరకు 28మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో ప్రజల ఆచూకీ గల్లంతైంది. ఈ వరదలవల్ల బ్రిడ్జ్ కూలిపోవడంతో పాటు రోడ్లు దెబ్బతిన్నాయి. దాంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు వెల్లడించారు. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్‌కు సమీపంలో ఉండే ఇండోనేసియా తరచూ భూకంపాలు, సునామీ వంటి విపత్తులను ఎదుర్కొంటోంది. ఈ రింగ్ అనేది పసిఫిక్ మహాసముద్ర తీరంవెంట విస్తరించి ఉన్న భారీ టెక్టోనిక్ బెల్ట్. ఇక్కడే 90శాతం భూకంపాలు సంభవిస్తుంటాయి. జపాన్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, న్యూజిలాండ్, అలస్కాలోని అల్యూటియన్ దీవులు దీని పరిధిలోకి వస్తాయి.



# దీప్తి శర్మ కోసం హై డ్రామా

## రూ. 3.20 కోట్లకు యూపీ సొంతం



మహిళల ప్రీమియర్ లీగ్ -2026 మెగా వేలంలో టీమిండియా ఆల్‌రౌండర్, మహిళల ప్రపంచ కప్ టోర్నీలో కీలక పాత్ర పోషించిన దీప్తి శర్మ కోసం పెద్ద హైడ్రామానే నడిచింది. తొలుత ఆమెను దక్కించుకునేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడగా.. 'ఆర్‌టీఎమ్' కార్డ్ ఉపయోగించి యూపీ ఏకంగా రూ.3.20కోట్లకు సొంతం చేసుకుంది.

గతేడాది జరిగిన డబ్ల్యూపీఎల్‌లో దీప్తి శర్మ యూపీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించింది. అయితే మెగా వేలానికి ముందు ఈ జట్టు దీప్తిని రిటైన్ చేసుకోలేదు. దీంతో గురువారం జరిగిన వేలంలో తొలి సెట్‌లో దీప్తి శర్మను కనీస ధర రూ.50లక్షలకు తీసుకునేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ ఆసక్తి చూపించింది. ఆ సమయంలో యూపీ వారియర్స్ రైట్ టు మ్యాచ్ కార్డు అవకాశాన్ని వినియోగించుకుంది. ఈ కార్డ్‌ను యూపీ ఉపయోగించుకోగానే.. ఢిల్లీ తన బిడ్‌ను రూ.3.20కోట్లకు పెంచేసింది.

ఆ ధరకు యూపీ వారియర్స్ అంగీకరించడంతో దీప్తి శర్మ మళ్లీ పాత జట్టుకే వెళ్లిపోయింది. అంత మొత్తం వెచ్చించేందుకు యూపీ జట్టు వెనుకాడకపోవడంతో ఢిల్లీ క్యాంప్‌లో ఉన్న సౌరవ్ గంగూలీ సైతం ఆశ్చర్యపోయారు. ఈ ధరతో డబ్ల్యూపీఎల్‌లో ఇప్పటివరకు రెండో అత్యధిక ధర కలిగిన ప్లేయర్‌గా దీప్తి శర్మ నిలిచింది. గతంలో స్మృతి మంధానను బెంగళూరు జట్టు రూ.3.4కోట్లకు దక్కించుకుంది.

ఇటీవల జరిగిన మహిళల ప్రపంచకప్ టోర్నీలో దీప్తి శర్మ అద్భుతంగా రాణించిన సంగతి తెలిసిందే. అటు బ్యాట్‌తోనూ.. ఇటు బంతితోనూ అదరగొట్టి ఫైనల్ పోరులో టీమ్‌ఇండియాకు కప్పు అందించడంలో కీలక పాత్ర పోషించింది. 215 పరుగులు, 22 వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచింది.

# శ్రీచరణికి జాక్‌పాట్

## రూ.1.30 కోట్లకు ఢిల్లీ కొనుగోలు



భారత క్రికెటర్, కడప జిల్లాకు చెందిన నల్లపురెడ్డి శ్రీచరణికి ఐపీఎల్ వేలంలో మంచి ధర పలికింది. మహిళల ప్రీమియర్ లీగ్-2026 మెగా వేలంలో ఫ్రాంచైజీలు ఆమె కోసం పోటీపడ్డాయి. ఈ క్రమంలో శ్రీచరణికి భారీ ధర దక్కింది.

ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్-2025 టోర్నమెంట్లో భారత్ చాంపియన్‌గా నిలవడంలో శ్రీచరణిది ముఖ్య భూమిక, ఈ మెగా టోర్నీలో శ్రీచరణి ఏకంగా పద్నాలుగు వికెట్లు పడగొట్టింది. తద్వారా భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ నిలిచింది.

ఈ నేపథ్యంలో ప్రపంచకప్ విజేత శ్రీచరణికి భారీ ధర దక్కుతుందనే అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్లుగానే ఆమె అదరగొట్టింది. రూ. 30 లక్షల కనీస ధరతో శ్రీచరణి వేలంలోకి రాగా.. యూపీ వారియర్స్ తొలి బిడ్ వేసింది. ఆ వెంటనే ఢిల్లీ క్యాపిటల్స్ రంగంలోకి దిగి.. ధరను ఏకంగా రూ.75 లక్షలకు పెంచింది.

దీంతో యూవీ వెనక్కి తగ్గినట్లే తగ్గి.. ఆ వెంటనే మళ్లీ రూ.90 లక్షలకు ధరను పెంచింది. ఈ క్రమంలో శ్రీచరణిని సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో ఢిల్లీ క్యాపిటల్స్ ధరను ఏకంగా రూ.1.3 కోట్లకు పెంచగా.. యూపీ వెనక్కి తగ్గింది. ఫలితంగా శ్రీచరణి రూ. 1.3 కోట్లకు మళ్లీ సొంతగూటి (ఢిల్లీ)కి చేరుకుంది.

కాగా గతంలో శ్రీచరణి ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడింది. 2024 సీజన్లో రూ.55 లక్షలకు ఆమెను ఢిల్లీ ఫ్రాంఛైజీ కొనుగోలు చేసింది. దీంతో అత్యధిక ధర దక్కించుకున్న నాటి అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ల లిస్టులో శ్రీచరణి చేరింది.

ఆంధ్రప్రదేశ్ లోని కడపకు చెందిన శ్రీచరణి 2025 ఏప్రిల్లో అంతర్జాతీయ క్రికెట్లో అడుగుపెట్టింది. శ్రీలంకతో ముక్కోణపు వన్డే సిరీస్ ద్వారా ఎంట్రీ ఇచ్చిన ఆమె.. అదే ఏడాది ఇంగ్లండ్ మ్యాచ్ సందర్భంగా టీ20లలోనూ అడుగుపెట్టింది. 4/12 గణాంకాలతో సత్తా చాటి తొలి అంతర్జాతీయ టీ20లోనే ఈ ఘనత సాధించిన రెండో భారత మహిళా క్రికెటర్‌గా నిలిచింది.

# స్పిన్ ఆడటంలో బ్యాటర్ల వైఫల్యం వల్లే..



బ్యాటర్ల వైఫల్యం వల్లే భారత్ స్వదేశంలో దక్షిణాఫ్రికాతో సిరీస్ కోల్పోయిందని టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తేల్చిచెప్పాడు. దక్షిణాఫ్రికా చేతిలో స్వదేశంలో టెస్ట్ సిరీస్‌ను టీమిండియా కోల్పోయింది. ఇలా జరగడం 25 ఏళ్లలో ఇదే తొలిసారి. గతంలో 2000 సంవత్సరంలో భారత జట్టు ఇలాగే సిరీస్ ఓటమిని మూట గట్టుకుంది. కోల్‌కతా టెస్ట్‌లో 30 పరుగుల తేడాతో ఓటమి చవిచూసిన టీమ్ ఇండియా, గువాహటి టెస్ట్‌లో ఏకంగా 408 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. భారత జట్టుకు టెస్టుల్లో ఇదే అతిపెద్ద ఓటమి. ఇంతకుముందు మన జట్టు 2004లో నాగ్‌పూర్ వేదికగా ఆస్ట్రేలియా చేతిలో 342 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

దనిపై అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా విశ్లేషించాడు. స్పిన్‌ను సమర్థమంతంగా ఎదుర్కోవడంలో బ్యాటర్లు ఇబ్బంది పడుతున్నారన్నారు. 'భారత ఆటగాళ్ల బ్యాటింగ్ పేలవంగా ఉంది. మన బ్యాటర్లు సరిగా స్వీప్ షాట్లు ఆడటం లేదని నేను 3, 4 సంవత్సరాలుగా చెబుతూనే ఉన్నా. గత న్యూజిలాండ్ సిరీస్‌లో ఆ జట్టు బ్యాటర్లు చక్కగా స్వీప్ చేశారు. దాన్ని డిఫెన్స్‌గా వాడుకున్నారు. ఒక బాల్‌ను డిఫెండ్ చేస్తే.. మరో దాన్ని స్వీప్ షాట్ కొట్టారు. వాళ్లు స్వీప్ షాట్ల మీద చక్కగా కసరత్తు చేశారన్నాడు. దక్షిణాఫ్రికా స్పిన్నర్ సైమన్ హార్మర్ బౌలింగ్ లో మన బ్యాటర్లు ఎంతమంది చక్కని డిఫెన్స్ ఆడారు? డిఫెన్స్ ఆడటంలో లోపాలుంటేనే షాట్లు ఆడటానికి ప్రయత్నిస్తారు. బిగ్ హిట్టింగ్ మా ఆట తీరని సాకులు చెబుతుంటారు. కానీ బ్యాటర్లు కచ్చితంగా డిఫెన్స్ ఆడగలగాలి. గొప్ప ఆటగాళ్ల సామర్థ్యం వారు ఆడే డిఫెన్స్ వల్లే తెలుస్తుంది. ప్రస్తుత బ్యాటర్లు స్పిన్ ఆడలేకపోవడమే అతి పెద్ద సమస్య. టీమ్ ఇండియా స్పిన్ ఆడటంలో అట్టడుగున ఉంది' అని అశ్విన్ పేర్కొన్నాడు.

# వచ్చే జనవరి 9నుంచి డబ్ల్యూపీఎల్

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) -2026 వచ్చే జనవరి 9న ప్రారంభంకానుంది. ఈ మేరకు గురువారం బీసీసీఐ ప్రకటించింది. ఫిబ్రవరి ఐదు వరకు ఈ టోర్నీ కొనసాగనుంది. నవీ ముంబయి, వడోదరలో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయని వెల్లడించింది. అయితే దీనికి సంబంధించిన పూర్తి షెడ్యూల్ విడుదల కావాల్సి ఉంది.

ప్రస్తుతం ఢిల్లీలో డబ్ల్యూపీఎల్ మెగా వేలం సందర్భంగా లీగ్ చైర్మన్ జయేశ్ జార్జ్ ఈ తేదీలు, వేదికల గురించి వెల్లడించారు. మహిళల ప్రపంచకప్ ఫైనల్ జరిగిన నవీ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియంలో డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ ప్రారంభంకానుంది. ఫైనల్ మ్యాచుకు వడోదరలోని బీసీఏ స్టేడియం వేదికకానుంది. గత సీజన్లో బెంగళూరు, లక్నో, ముంబయి, వడోదరలో ఈ మ్యాచ్‌లు జరిగాయి. ముంబయిలోని బ్రబోర్న్ స్టేడియంలో మహిళల ప్రీమియర్ లీగ్ ఫైనల్ జరగ్గా.. ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి ముంబయి ఇండియన్స్ కప్ గెలిచింది. ఇప్పటి వరకు జరిగిన మూడు సీజన్లలో ఆ జట్టే రెండుసార్లు విజేతగా నిలిచింది. సెకండ్ సీజన్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజయం దక్కించుకుంది.

# సిరాజ్‌కు ఎయిర్ ఇండియా క్షమాపణలు

గువహటి నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన విమానం బుధవారం రాత్రి చాలా సేపు ఆలస్యం కావటం..చివరికి సర్వీసును రద్దు చేయటంపై భారత ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ ఎక్స్ వేదికగా అసంతృప్తి వ్యక్తం చేశారు. విమాన సర్వీస్ విషయంలో స్పష్టత లేకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి చిక్కుకుపోయారని విమర్శించాడు. దీనిపై దీనిపై గురువారం ఎయిర్ ఇండియా సంస్థ స్పందించింది. గువాహటి-హైదరాబాద్ ఫ్లైట్ ఐఎక్స్ 2884ను అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. 'అనివార్య కారణాల వల్ల విమానాన్ని రద్దు చేసినందుకు చింతిస్తున్నాం. ఇబ్బంది కలిగినందుకు క్షమించండి. మా సిబ్బంది ప్రయాణికులకు కావాల్సిన ఏర్పాట్లు చేసింది. బుధవారం ప్రయాణికులు ఎదుర్కొన్న పరిస్థితి ఎంత కష్టంగా ఉంటుందో మేం అర్థం చేసుకోగలం. మీ సహనం, మీ ఓపికకు ధన్యవాదాలు. పరిస్థితి చక్కబడేంత వరకు మా సిబ్బంది మీకు కావాల్సిన సాయం చేస్తుందని ఎయిర్ ఇండియా 'ఎక్స్'లో సిరాజ్ పోస్ట్‌కు సమాధానం ఇచ్చింది.



# గంభీర్‌కు మద్దతుగా బీసీసీఐ



గత ఏడాది న్యూజిలాండ్ చేతుల్లో స్వదేశంలో టీమిండియా వైట్‌వాష్‌కు గురైన చేదు జ్ఞాపకాలు ఇంకా పూర్తిగా చెరిగిపోకముందే.. తాజాగా దక్షిణాఫ్రికా చేతిలోనూ సొంతగడ్డపై మరోసారి వైట్‌వాష్‌కు గురై 0-2 తేడాతో సిరీస్ కోల్పోయింది. గౌతం గంభీర్ కోచ్‌గా వచ్చిన 16 నెలల కాలంలో టీమిండియా మూడు టెస్ట్ సిరీసులు ఓడిపోయింది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాపై ఓటమి పాలైంది. గంభీర్ బాధ్యతలు చేపట్టాక ఇప్పటివరకు భారత జట్టు 19 టెస్ట్ మ్యాచ్లు ఆడితే కేవలం 7 మ్యాచుల్లోనే విజయం సాధించింది. ఏకంగా 10 టెస్టుల్లో పరాజయం పాలైంది. 2 మ్యాచ్లు డ్రాగా ముగిశాయి. గెలుపు శాతం కేవలం 36.82గా ఉంది. ఈ నేపథ్యంలో టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను ఆ పదవి నుంచి తప్పించాలని డిమాండ్లు ఊపందుకుంటున్నాయి. గువాహటి టెస్ట్ మ్యాచ్ అనంతరం మైదానంలోని పలువురు అభిమానులు సైతం గంభీర్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. కానీ బీసీసీఐ మాత్రం కోచ్ గౌతమ్ గంభీర్ కు మద్దతుగా నిలుస్తోంది!

దీనిపై బీసీసీఐకి చెందిన ఒక ఉన్నతాధికారి మాట్లాడుతూ.. బీసీసీఐ తొందరపాటుగా ఏ నిర్ణయాలూ తీసుకోదు. ప్రస్తుతం టీమిండియా సంధి దశలో ఉంది. వరల్డ్ కప్ సమీపిస్తున్న నేపథ్యంలో కోచ్ గౌతమ్ గంభీర్ విషయంలో ఇప్పటికిప్పుడు ఏ నిర్ణయమూ తీసుకోం. అతడి కాంట్రాక్ట్ 2027 వరల్డ్ కప్ వరకు ఉంది. సెలక్టర్లు, టీమ్ మేనేజిమెంట్‌తో మాట్లాడి బీసీసీఐ ముందుకుసాగుతుంది. కానీ కోచ్ విషయంలో సంచలన నిర్ణయాలు ఏమీ ఉండవని తెలిపారు.

బుధవారం గువాహటి టెస్ట్‌లో ఓటమి అనంతరం విలేకరుల సమావేశంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మాట్లాడాడు. కోచ్‌గా తన భవిష్యత్తు విషయంలో విలేకరుల నుంచి ఎదురైన ప్రశ్నకు సమాధానం ఇచ్చాడు. 'ఆ విషయాన్ని బీసీసీఐ నిర్ణయిస్తుంది. ఇండియన్ క్రికెట్ ముఖ్యం.. నేను కాదు. ఈ విషయాన్ని నేను టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిర్వహించిన మొదటి ప్రెస్‌మీట్‌లోనే చెప్పాను. ఇప్పుడు కూడా అదే చెబుతున్నాను. యువ జట్టుతో ఇంగ్లాండ్ లో సాధించిన ఫలితాలను మర్చిపోయిన జనం.. న్యూజిలాండ్ చేతిలో ఓటమి గురించే మాట్లాడతారు. నేను ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ లోనూ జట్టును గెలిపించానని గౌతమ్ గంభీర్ గుర్తు చేశాడు.

చైతన్య రథం
సినిమా
శుక్రవారం 28 నవంబర్ 2025


# భారీ ధరకు దృశ్యం-3




'దృశ్యం3' ప్రకటించినప్పటి నుంచీ భారతీయ సినీ ప్రేక్షకుల్లో మెదిలే ప్రశ్న ఒక్కటే. అన్ని భాషల్లో కలిపి ఒకేసారి విడుదల చేస్తారా? అని. మలయాళంలో ఇప్పటికే ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉండగా, ఇతర భాషలకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదు. ఈ క్రమంలో చిత్ర నిర్మాణ సంస్థ ఆశీర్వాద్ మూవీస్ ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్, డిజిటల్ రైట్స్‌ను విక్రయించింది. ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ, డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పనోరమా స్టూడియోస్ 'దృశ్యం 3' విడుదల హక్కులను సొంతం చేసుకుంది. ఇందుకోసం రూ.160కోట్లు చెల్లించినట్టు ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ఎక్కువగా హిందీ సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేసే ఈ సంస్థ 'దృశ్యం3' హక్కులను దక్కించుకోవడంతో విడుదల విషయంలో కొంతవరకూ స్పష్టత వచ్చినట్టయ్యింది. మలయాళంతోపాటు, హిందీలోనూ ఒకేసారి విడుదల చేసేందుకు అవకాశం ఉందని చిత్ర వర్గాలు భావిస్తున్నాయి.

**మలయాళంలో విడుదల ఆలస్యం..**

పనోరమా స్టూడియోస్ ఈ మూవీ హక్కులను సొంతం చేసుకోవడంతో మలయాళంలో 'దృశ్యం?' విడుదల కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉంది. హిందీలో ఈ మూవీ ఇంకా పట్టాలెక్కలేదు. త్వరలోనే షూటింగ్ మొదలయ్యే అవకాశం ఉంది. డిసెంబరులో ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లవచ్చని అంటున్నారు. దీనిపైనా స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు తెలుగులో వెంకటేశ్ ఈ మూవీ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన త్రివిక్రమ్‌తో ఫ్యామిలీ ఎంటర్టైనర్లో నటిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో పాటు, 'దృశ్యం3'కి చేయాల్సి ఉంటుంది. రెండు సినిమాలకు డేట్స్ అడ్జెస్ట్ చేయాలి. మరి వెంకీ దేనికి ప్రాధాన్యమిస్తారో చూడాలి. ఇవన్నీ ఓ కొలిక్కి వచ్చేలోపు జీతూజోసెఫ్ మలయాళ వర్షన్ షూటింగ్ పూర్తి చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు.. ఎందుకంటే ఆయన టేకింగ్ అంత వేగంగా ఉంటుంది. అక్కడ పూర్తి చేసి, వెంటనే తెలుగు మూవీ కోసం వస్తారేమో చూడాలి.

మోహన్ లాల్, జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో వచ్చిన 'దృశ్యం'చిత్రాలు బాక్సాఫీస్‌వద్ద ఎంతటి ఘన విజయాన్ని నమోదు చేశాయో అందరికీ తెలిసిందే. ఈ ఫ్రాంచైజీలో ఇప్పటికే రెండుచిత్రాలు వచ్చి అలరించగా ఇప్పుడు మూడో భాగం సిద్ధమవు తోంది. అనుకోకుండా జరిగిన ఓ హత్య చుట్టూ సాగే కుటుంబ కథ నేపథ్యంలో 'దృశ్యం' సినిమాలు తెరకెక్కాయి. ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద రూ.240 కోట్లకు పైగా వసూలు చేసిన విషయం తెలిసిందే.

# వానరులంటే ఎవరు?




నటుడు విశ్వక్సేన్ వాయిస్ ఓవర్ ఇచ్చిన 'వానర' టీజర్ తాజాగా విడుదలైంది. వానరులంటే ఎవరు? అనే ప్రశ్నతో మొదలైన వీడియో ఆసక్తిగా సాగింది. ఈ సినిమాతో అవినాశ్ తిరువీధుల దర్శకుడు, నటుడిగా పరిచయం కానున్నారు. సిమ్రన్ చౌదరి హీరోయిన్. నందు విలన్‌గా నటించారు. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. మంచు మనోజ్ ముఖ్య అతిథిగా.. హైదరాబాద్‌లో ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్ జరిగింది.

# నా లైఫ్‌లో అన్నీ ధర్మేంద్రనే



హిందీ చిత్రసీమ అందగాడు.. నటి హేమమాలిని భర్త ధర్మేంద్ర ఇటీవల తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆయన మరణం తనకు తీరని లోటని హేమ మాలిని ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ధర్మేంద్రతో దిగిన కొన్ని ఫొటోలను పంచుకున్నారు. "నా జీవితంలో అన్నీ ధర్మేంద్రనే. భార్యను అమితంగా ప్రేమించే భర్త, పిల్లల్ని బాధ్యతగా చూసుకునే తండ్రి.. మంచి స్నేహితుడు, మార్గదర్శకుడు, గొప్ప కవి.. ఇలా అన్నీ ఆయనే. నా కష్టసుఖాల్లో తోడున్నాడు. కుటుంబమే సర్వస్వం అనుకుని బతికాడు. ఒక నటుడిగా ఆయన ప్రతిభ ఆయనను లెజెండ్‌ని చేసింది. ఆయన కీర్తి ఎప్పటికీ శాశ్వతంగా నిలిచిపోతుంది. ఇక వ్యక్తిగతంగా నాకు ఆయన లేని లోటు తీర్చలేనిది. ఆ బాధ వర్ణించలేనిది. ఆయనతో కలిసి జీవించిన క్షణాలు నాకు ఎప్పటికీ ప్రత్యేకమే. లెక్కలేనని జ్ఞాపకాలు ఇచ్చారు" అంటూ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. కుటుంబంతో కలిసి దిగిన ఫొటోలను పంచుకున్నారు.

# ఉచితంగా.. రాజు వెడ్స్ రాంబాయి

ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి ఆదరణను సొంతం చేసుకున్న ప్రేమకథ 'రాజు వెడ్స్ రాంబాయి'. అఖిల్ రాజ్, తేజస్వి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాకు సాయిలు కంభంపాటి దర్శకత్వం వహించారు. ఇప్పుడీ సినిమాను ఉచితంగా చూసే అవకాశాన్ని చిత్రబృందం కల్పించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ఫేమస్ థియేటర్లలో ఈ చిత్రాన్ని ఉచితంగా చూడొచ్చని పేర్కొన్నారు. మహిళలకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నట్టు తెలుపుతూ పోస్ట్ పెట్టారు. ఈరోజు వరకూ ఈ ఆఫర్ ఉంటుందన్నారు. థియేటర్ దగ్గరకు వెళ్లి టికెట్లు ఉచితంగా తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 17 థియేటర్లలో ఉచితంగా టికెట్లు ఇస్తున్నారు.

***కథేంటంటే..:*** అది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్. వరంగల్- ఖమ్మం మధ్య ఉన్న పల్లెటూరు. ఆ ఊళ్లో రాజు (అఖిల్ రాజ్) బ్యాండ్ కొట్టడంలో తనకు తానే సాటి. పెళ్లి వేడుకైనా.. చావు కార్యక్రమమైనా రాజు బ్యాండ్ గట్టిగా సౌండ్ చేయాల్సిందే. తను ఆ ఊరికే చెందిన రాంబాయి (తేజస్విని రావ్)ని చిన్నప్పట్నుంచి ప్రాణంగా ప్రేమిస్తుంటాడు. మొదట్లో అతని ప్రేమను రాంబాయి వ్యతిరేకించినా.. తర్వాత తన ప్రేమలోని నిజాయితీ, బ్యాండ్ కొట్టే స్టైల్ చూసి అంగీకారం తెలుపుతుంది. అయితే ఆమె తండ్రి వెంకన్న (చైతన్య జొన్నలగడ్డ).. కూతురికి ప్రభుత్వ ఉద్యోగం ఉన్న కుర్రాడినే ఇచ్చి పెళ్లి చేయాలన్న లక్ష్యంతో జీవిస్తుంటాడు. అందుకే రాంబాయిని పెళ్లి చేసుకునేందుకు ఆమెతో కలిసి రాజు ఓ దారి ఎంచుకుంటాడు. మూడు ముళ్లు వేయడానికి ముందే ఆమెని గర్భవతిని చేస్తే.. వెంకన్న వచ్చినట్టు తమకు పెళ్లి చేస్తాడనుకుంటారు. మరి వాళ్లు అన్నంత పని చేశాక ఏమైంది? వెంకన్నవల్ల రాజు రాంబాయిల ప్రేమకథ ఎన్ని మలుపులు తిరిగింది? వాళ్ల పెళ్లిని అడ్డుకునేందుకు.. రాజుకు బుద్ధి చెప్పేందుకు వెంకన్న ఎలాంటి దుర్మార్గానికి ఒడిగట్టాడు? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి.



# మంచి సినిమాను ట్రోల్స్ ఆపలేవు



మంచి సినిమాను ట్రోల్స్ ఆపలేవని దర్శకుడు లింగుస్వామి అన్నారు.ఆయన దర్శకత్వంలో సూర్య హీరోగా తెరకెక్కిన చిత్రం 'సికిందర్'(తమిళంలో అంజాన్). 2014లో విడుదలైన సినిమా అనుకున్న స్థాయిలో విజయం సాధించలేక పోయింది. 11 ఏళ్ల తర్వాత ఈ చిత్రం మరోసారి ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో దీని గురించి కొన్ని విషయాలు పంచుకున్నారు. అప్పట్లో ఈ సినిమా రిలీజ్ అయినప్పుడుఎంతోమంది తనను ట్రోల్ చేశారని తెలిపారు. "సికిందర్ నాకు చాలా ఇష్టమైన చిత్రం. అప్పట్లో సినిమాను ప్రకటించినప్పుడే విడుదల తేదీలను వెల్లడించేవాళ్లు. దీంతో నాకు ఈ సినిమాను ఎడిట్ చేయడానికి సమయం దొరకలేదు. సాదాసీదాగా ఎడిట్ చేసి 2.30 గంటల సినిమాను విడుదల చేశా. ఇప్పుడు నేను భయపడటం లేదు. ఎందుకంటే 30 నిమిషాల కంటెంట్‌ను తొలగించి రీ ఎడిట్ చేసి సూర్యపై మాత్రమే ఫోకస్ చేశాం. ఇప్పుడు ఈ సినిమా అందరికీ నచ్చుతుందన్న నమ్మకం ఉంది. సూర్య కుటుంబానికి కూడా రీ ఎడిట్ చేసిన చిత్రం బాగా నచ్చింది. అభిమానులు దీన్ని కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు" అని తెలిపారు. ఇక గతంలో 'సికిందర్'పై వచ్చిన ట్రోల్స్ గురించి మాట్లాడుతూ.. "నేను ఈ సినిమా విషయంలో కొన్ని పొరపాట్లు చేశానని వందశాతం అంగీకరిస్తాను. కానీ, ఒక మంచి చిత్రాన్ని ట్రోల్స్ ఆపలేవు. కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా నిందించాలని చూస్తారు. అలాంటివారికి ఎవరూ సమాధానం చెప్పలేరు. వారు పెద్దపెద్ద సినిమాల్లోనూ తప్పులు ఎంచడమే పనిగా పెట్టుకుంటారు" అని లింగుస్వామి అన్నారు. సూర్య, సమంత జంటగా నటించిన ఈ సినిమా నవంబర్ 28న రీ రిలీజ్ కానుంది.

# భారీ రన్‌టైంతో.. దురంధర్



బాలీవుడ్ నటుడు రణ్వీర్ సింగ్ హీరోగా నటిస్తోన్న చిత్రం 'దురంధర్'. ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తోన్న సినిమా ఇప్పుడు బాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. దీనికి కారణం ఈ సినిమా రన్‌టైముకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ కావడమే. డిసెంబర్ 5న ఈ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో దీని రన్‌టైము గురించి సోషల్ మీడియాలో పలు వార్తలు వస్తున్నాయి. సినిమా నిడివి 3.32 గంటలని బాలీవుడ్ మీడియా పేర్కొంది. ఒకవేళ ఇదే నిజమైతే అత్యంత నిడివివున్న భారతీయ చిత్రాల్లో 'దురంధర్' ఒకటవుతుంది. ఇక ఈ సినిమా మేజర్ మోహిత్ శర్మ జీవితం ఆధారంగా తెరకెక్కిందంటూ వస్తోన్న వార్తలపై దర్శకుడు తాజాగా స్పష్టతనిచ్చారు. "ఇది ఎవరి బయోపిక్ కాదు. భవిష్యత్తులో మోహిత్ శర్మపై బయోపిక్ తీస్తే వారి కుటుంబసభ్యుల అనుమతి తీసుకొని అధికారికంగా ప్రకటిస్తాను. దేశం కోసం ఆయన చేసిన త్యాగాన్ని ఎప్పటికీ మర్చిపోలేం. ఆ బయోపిక్‌ను గౌరవంగా రూపొందిస్తా. 'ధురంధర్'లో ఆయన గురించి చూపించలేదు" అని స్పష్టంచేశారు.

# ఇంటివాడైన రాహుల్ సిప్లిగంజ్

గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ఓ ఇంటివాడయ్యారు. ఈరోజు తెల్లవారు జామున తన ప్రియురాలు హరిణ్య మెడలో మూడుముళ్లు వేసి వివాహబంధంలోకి అడుగుపెట్టారు. హైదరాబాద్‌లో జరిగిన వీరి వివాహానికి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ప్రస్తుతం వీరి పెళ్లి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నెటిజన్లు ఈకొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.ఓల్డ్ సిటీనుంచి 'ఆస్కార్' వరకూ వెళ్లిన కుర్రాడంటూ రాహుల్ను 'గద్దర్' అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్ కొనియాడిన విషయం తెలిసిందే. 'కాలేజ్ బుల్లోడా', 'వాస్తు బాగుందే', 'రంగా రంగా రంగస్థలానా', 'బొమ్మోలే ఉన్నదిరా పోరీ' లాంటి సినిమా పాటలు, 'ఓ నా రాహులా', బోనాలు, వినాయక చవితి తదితర స్పెషల్ సాంగ్స్ రాహుల్ శ్రోతలను విశేషంగా అలరించారు. 'రంగమార్తాండ'తో నటుడిగానూ ఆకట్టుకున్నారు. కాలభైరవతో కలిసి రాహుల్ పాడిన 'నాటు నాటు' (ఆర్ఆర్ఆర్) పాటకు ఆస్కార్ అవార్డు దక్కింది.

